# కాలజ్ఞానసుధ

ఆధ్యాత్మిక మాస పత్రిక

మే - 2015 సంపుటి:19 సంచిక: 5




## విషయ సూచిక


| | |
|---|---|
| సంపాదకీయం - శ్రీ ఆంజనేయస్వామి | 4 |
| క్షమా గుణం | 6 |
| మహాభారతంలోని నీతి కథలు | 8 |
| వీరకాళికాంబా శతకం -తత్త్వసిద్ధి | 10 |
| రాగ ద్వేషాలుంటే జీవుడు.. లేకుంటే దేవుడు | 13 |
| సనాతన ధర్మము - దాని విశిష్టత (క్రోధము) | 17 |
| భగవన్నామ స్మరనం (భక్తుని రక్షా కవచం) | 19 |
| యోగవాసిష్ట కథాలహరి - మహర్షిగా మారిన రాజర్షి | 20 |
| భగవద్గీతకు భాసురభాష్యం | 22 |
| చల్లగాసాగే సెలయేరు | 26 |
| సంకల్పసిద్ధి | 27 |
| ఆది గురువు ఆచార్య శంకరులు | 28 |
| రఘువంశం | 31 |
| దర్శనీయ దేవాలయాలు (భద్రాచలం) | 33 |
| శ్రీరామ భక్తి | 36 |
| వివిధ వ్యాధులు ఆయుర్వేద చికిత్సలు | 38 |


ముఖచిత్రం : శ్రీ ఆంజనేయస్వామివారు

**ఈ నెల సూక్తి**

భగవంతుని నీవు చూడలేకపోయినా ఆయన నిన్ను చూస్తూనే వున్నాడు. కనుక నీ నడవడి సక్రమంగా వుంచుకో.



**చందా వివరములు**

జీవిత చందా(20సం॥) : 1116/-
సంవత్సర చందా : 70/-


చందాలు పంప వలసిన చిరునామా:

**కాలజ్ఞాన సుధ**

శ్రీ అచలానంద ఆశ్రమము, 8-202(1), మంగమూరు రోడ్డు,
ఒంగోలు - 523 002 ప్రకాశం జిల్లా, (ఆం. ప్ర)
ఫోన్స్: 08592/235341, 9949132469,
9705555229, 8977799289

సంపాదకులు: శ్రీ పరిపూర్ణ సిద్ధానందస్వాములవారు

సంపాదకీయం

# శ్రీ ఆంజనేయస్వామి

అన్ని వృత్తులలో సేవకావృత్తి చాలా గొప్పది. సేవ అనగానే ముందు మనపూర్వీకులైన ఆంజనేయస్వామి సిద్ధయ్య మొదలగు గొప్ప శిష్యులు గుర్తోస్తారు. శిష్యుడు అంటే తన గురువుకు శరణాగత భక్తితో సేవ చేసేవాడని చెప్పవచ్చు. తల్లిదండ్రులను వదలి కందిమల్లయ్యపల్లె చేరి, శ్రీవీరబ్రహ్మేంద్రస్వామివారిని గురువుగా స్వీకరించి సేవించి సుప్రసిద్ధుడైనాడు సిద్ధయ్య, "గురువులందన్న శ్రీ వీరబ్రహ్మేంద్ర గురుడు శిష్యులందన్న పరిపూర్ణ సిద్ధమూర్తి అనే సుప్రసిద్ధనానుడిని మనము వింటుంటాము.

సేవకావృత్తిలో ఆంజనేయ స్వామిని గురించి వేరే చెప్పనక్కరలేదు. అందుకు రామాయణంలో అనేక సంఘటనలు మనకు కనిపిస్తుంటాయి. రామభక్తులలో కొందరికి ఆంజనేయస్వామి మీద అసహనం కలిగింది. కారణమేమంటే రామునికిసంబంధించినప్రతిపనీ తానేచేసుకుపోతున్నందువలన వారికిరాముని సేవచేసే అవకాశం లభించటం లేదట. అందుచేత వారు సీతమ్మవారి ద్వారా రామునికీ విషయాన్ని తెలియజేశారు. మరునాడు అందరికీ తలో పని అప్పగించింది సీతామాత అయితే ఆ సమయంలో ఆంజనేయుడు లేనందున వున్న సేవలన్ని తలోకటీ స్వీకరించారు. ఆ మరునాడు ఆంజనేయుడు వచ్చాడు. తాను తన ప్రభువుకి ఏ పని చేయబోతున్నా ఎవరో ఒక్కరు అడ్డుతగులుతున్నారు. ఈ సేవనాది అంటున్నారు.తన తల్లి సీతామాత వద్దకు వెళ్లి విషయాన్ని విన్నవించాడు. నాయనా నాటి దినం నీవు లేవు. వారందరు వున్న పనులన్ని పంచుకున్నారు. మిగిలివున్న పనేమైనా వుంటే చెప్పఅదినీకిస్తానన్న దాయమ్మ. సీతామాతకు నమస్కరించి వెంటేనే అమ్మా! రామప్రభువుకు ఆవలింత వస్తే చిటికె ఎవరు వేస్తారు ? అన్నాడు. అందరూ అవాకుయ్యారు. ఆ పనిని ఆంజనేయునికి అప్పగిస్తూ రాజముద్రిక వేసింది సీతామాత.

ఆంజనేయుడు తన ప్రభువు ఎటు వెళుతున్నా ఏ పని చెస్తున్నా చిటిక వేయుటకు సిద్ధంగా స్వామి ననుసరిస్తున్నాడు. స్వామికి ప్రక్షాళన చెస్తున్నా పాదాలు తుడుస్తున్నా స్వామినంటిపెట్టుకొనే వుంటున్నాడు. ఆ మిగతా పరివారం వారి వారి సేవలను ముగించుకొని విశ్రాంతి తీసుకుంటున్నారు. ఆంజనేయుడు మాత్రం నిరంబర సేవ చేస్తున్నాడు.

రాత్రి అయింది. స్వామి విశ్రమించుటకు శయన మందిరానికి వెళ్ళాడు. రామప్రభువు విశ్రమించాడు. సీతామాత ఆంజనేయునితో "నాయనా! ఇకనీవు వెలుపలకి వెళ్ళు" అన్నది. అదెలాగమ్మా ? నేను వెళ్ళనన్నాడు. నేను విశ్రమించాలి నీవు వెళ్ళు నాయనా! అనదాయమ్మ. విశ్రమించండ నా కర్తవ్యాన్ని నేను నిర్వహించాలి కదా ? అనాడాయన. మేము భార్యాభర్తలమయ్యా నీవు వెలుపలికి వెళ్ళు అన్నది. అయితే ఎమిటి నేను వెళ్ళనన్నాడు. భార్యభర్తలు

వుండే గదిలో నీవు వుండరాదన్నదామె. వుంటే ఏమిటి ? అన్నాడాంజనేయుడు. అయ్యో నీవు ఘోటక బ్రహ్మచారివి నేను చెప్పేది నీకు అర్థంకాదు. ముందు నీవు వెలుపలికి వెళ్ళు" అన్నది. నేను వెలుపలికి వెళ్ళితే "అయ్యావారికి ఆవలంత వస్తే చిటిక ఎవరెస్తారమ్మా అన్నాడు. నెనేస్తాలెవయ్యా అన్నదామె! అదెలా నేను వెళ్ళనమ్మ అని అన్నాడు. "సీతామాత కొంచెం కోపగిస్తూ నేను నిన్ను శాసిస్తున్నాను నీవు వెలిపలికి వెళ్ళు అన్నది" ఆంజనేయుడు చేసేదిలేక అక్కడి నుండీ చిటికెలు వెస్తూ వెలుపలికి వచ్చాడు. అంటే తాను వెలుపలికి వచ్చినప్పడు ఒక వేళ రాముడు ఆవలించినా ఇబ్బందిలేకుండా వుండాలన్నది ఆయన అభిమతం.

ఆంజనేయుడు చిటికెలు వేయటం ప్రారంభించగానే లోపల రాములవారు ఆవలించటం మొదలుపెట్టాడు. వెలుపలివున్న ఆంజనేయుడు జయ జయ రామ్ - సీతారామ్" అంటూ సంకీర్తన చెస్తూ చిటికెలు వేస్తున్నాడు. ఆ రామభక్తి తన్మయంతో వేగంగా చిటికేలు వేస్తుంటే రామునికి కూడా అంతే వేగంగా ఆవలింతొస్తున్నాయి.

సీతామాత ఎన్ని ఉపచర్యలు చేసినా రామునికి ఆవలింతలు ఆగలేదు. కౌసల్య సుమిత్ర కైకేయీ ముగ్గురు మాతలను పిలిపించింది సీతామాత. అందరూ చేరారు. రాజవైద్యులు వచ్చారు. ఎవరు విన్న ఉపచర్యలు చేసినా రాముని ఆవలింతలు ఆగలేదు. ఆంజనేయుడు భక్తి తన్మయంలో వేగంగా నామం చేస్తూ చిటికెలు వేస్తుంటే రాముడూ వేగంగా ఆవలిస్తు విపరీతమైన ఆవేదనకు గురి అవుతున్నాడు. రాజవైద్యులుకు ఆ వ్యాధి ఏమిటో అర్థం కాలేదు.కబురంపింది కౌసల్యాదేవి, వశిస్టులవారు వచ్చారు. పరిస్థితని గమనించాడు. "ఇంతకూ మన ఆంజనేయుడు ఎక్కడ ?" అని అడిగాడు వాడు అడిగో ఆ వెలుపల గోడ మీద కూర్చొని చిటికేలు వేసుకుంటూన్నడని చెప్పారు. అమ్మా! ఈ ప్రభువు వ్యాధికి పరిష్కారం ఆ ఆంజనేయుని చిటికేలలో వున్నది. అక్కడ ఆయన చిటికెలు ఆపితేనే ఇక్కడ రామునికి ఆవలింతలు తగ్గుతాయని చెప్పాడు. ఎవరు చెప్పినా ఆంజనేడు చిటికేలు ఆపలేదు. వశిష్టుడు వెళ్ళి ఆంజనేయా ! మీ ప్రభువుకు సుస్తిగా వున్నదయ్యా ఇటురా! అన్నాడు. వెంటనే ఆంజనేయుడ ఆ...! నా ప్రభువుకు సుస్తిగావున్నదా ? అంటూ చిటికేలు ఆపి స్వామి చంతకు వచ్చాడు. అంతే రాముని ఆవలింతలు ఆగాయి.

భక్తి అనేది అధికారంతోనో, సేవలుచేయించుకోవటంతోనో వచ్చేదికాదు. రాముని వద్ద సేవలు వేయించుకున్న భారంతో వారి వారి పనులను చేసుకొనివారి సమయం అయిపోగానే విశ్రమించారు. ఏ పని! చేయనివ్వటంటేదు అన్నవారు. పనీ ఇవ్వగానే సమయం ఏప్పడేప్పడాయిపోతుంది అని సమయం కాగానే జారుకున్నారు.

ఏ పనికానీ లేకపోయినా, చిటికే అని ఒక పనిని సృష్టించుకొని ఎల్లవేళ్ళల తన ప్రభువు సేవలో వున్నాడు ఆంజనేయుడు. భక్తి అనేది హృదయాంతరాళం నుండి రావాలి. సేవ పవిత్రతతో సంపూర్ణ విశ్వాసంతో చేయాలి దానికి వెలలులేవు, వెల్లలూవుండవు.

ఇది ప్రతి శిష్యుడనూ, భక్తుడును గ్రహించాలి.

తేది 13-8-2015న హనుమజ్జయంతి సందర్భంగా సమర్పణ

# క్షమా గుణం

- గోనుగుంట మురళీకృష్ణ

పగ ప్రతీకారాలు వ్యతిరేక భావాలు. చిన్న చిన్న తప్పులకు పగ తీర్చుకోవాలనిపించదు. క్షమించరాని తప్పులు చేసినప్పుడు గుండె మండిపోతుంది. మనసు పగతో రగిలిపోతుంది. ప్రతీకారం తీర్చుకోవాలనిపిస్తుంది. ప్రతీకారం తీర్చుకోవటం ద్వారా పగచల్లారినా ఎదుటి వారి తప్పులను క్షమించటం ఉత్తమం. క్షమాగుణమే ఎవరినైనా ఉన్నతులుగా చేస్తుంది.

రావణాసురుడిచేత అపహరించుకురాబడ్డ సీత అశోకవనంలో చెట్టు క్రింద కుర్చుని ఉన్నది. చుట్టూ కాపలాగా ఉన్న రాక్షస స్త్రీలు సీతను నానావిధాలుగా మాట్లాడుతూ హింసిస్తున్నారు.

''రావణుడంటే ఎవరనుకున్నావు ? మహాపరాక్రమశాలి. అతనికి భయపడి సూర్యుడు గట్టిగా ఎండకాయడు. వాయువు గట్టిగా వీచడు. అలాంటి రావనుడికి భార్యగా ఉండటం ఎంత అదృష్టమో ఆలోచించు'' అన్నది ఒక రాక్షస స్త్రీ.

''రావణుడికి వెయ్యి మంది భార్యలు. అందరిలోకి మండోదరి మిక్కిలి ప్రీతిపాత్రురాలు. అలాంటి మండోదరిని కూడా వదిలిపెట్టి నిన్నే ఏలుకుంటానన్నాడు. ఆ అవకాశాన్ని ఎవరైనా పోగొట్టుకుంటారా ? చూడబోతే నీవు బుద్ధిహీనురాలిలా ఉన్నావే!'' అన్నది మరొక స్త్రీ.

'రాముడు మానవుడు. అందునా రాజ్యం కోల్పోయి అడవులలో ఉన్నాడు. అలాంటివాడికి భార్యగా ఉండటం వల్ల ఏం లాభం ? మా మాట విని రావణుని వరించు. మా మాట వినకపోతే నీవు ప్రాణాలతో ఉండలేవు'' అన్నది వేరొకతి.

ఆ మాటలు విన్న సీత కళ్ళనీళ్ళ పర్యంతమవుతూ ''అమ్మలారా! మీరంతా కలసి నన్ను భక్షించండి. మీ మాట వినటం కన్నా నాకు అదే ఇష్టం. రాముడు మానవుడు కావచ్చు. రాజ్యం లేకపోవచ్చు. అయినా నాకు ఆయనే అధికుడు. నేను ఎప్పటికీ రామపత్నిగానే ఉంటాను'' అన్నది.

సీతాన్వేషణ చేస్తూ వచ్చిన హనుమంతుడు సూక్ష్మరూపంలో సీత కుర్చున్న చెట్టుమీదనే ఉన్నాడు. ఆయనకు రాక్షస స్త్రీల మాటలు చాలా కోపం కలిగించాయి. ఒక ముష్టిఘాతంతో వాళ్ళందరినీ చంపేద్దామనుకున్నాడు. కానీ అలా చేస్తే రామకార్యం చెడిపోతుందేమోనని కోపం నిగ్రహించుకున్నాడు.

రావణసంహారం తర్వాత హనుమంతుడు సీతకు ఈ విషయం గుర్తుచేసి ''అమ్మా! నిన్ను నానా పరుషోక్తులతో హింసించిన ఈ రాక్షస స్త్రీలందరినీ ఇప్పుడే వధిస్తాను. అనుజ్ఞ ఇవ్వు'' అన్నాడు.

''హనుమా! వారు రావణుని దాసీలు. తమ ప్రభువు ఆదేశానుసారం ఆ విధంగా చేశారు. ఇందులో వాళ్ళ తప్పు ఏమున్నది ? వాళ్ళని విడిచిపెట్టు'' అన్నది సీత. సీత క్షమాగుణమే ఆ రాక్షస స్త్రీల ప్రాణాలు కాపాడింది.

అంబరీషుడు ద్వాదశి వ్రతం చేసే సమయానికి దుర్వాసుడు అతిథిగా వచ్చాడు. ఆయన నదీ తీరానికి స్నానానికి వెళ్లి ఎంతకూ తిరిగిరాలేదు. ద్వాదశి ఘడియలు దాటిపోతే ఫలం దక్కదు. అతిథిని విడిచి

భోజనం చేయటం యుక్తంకాదు. అందువల్ల ధర్మహాని కాకుండా అంబరీషుడు జలపానం చేశాడు.

తిరిగి వచ్చిన దుర్వాసుడు జరిగినది తెలుసుకుని జటనొకదానిని పెకలించి అంబరీషునిపై ప్రయోగించాడు. అది జ్వాలా రూపంలో ఆయనపైకి వచ్చింది. అంబరీషుడిని సదా రక్షిస్తూ ఉండే చక్రాయుధం జ్వాలను నిర్మూలించి దుర్వాసుడి మీదికి వచ్చింది.

దుర్వాసుడు బ్రహ్మ దగ్గరికీ, శివుడి దగ్గరికీ వెళ్ళినా వారు రక్షించలేదు. విష్ణువు దగ్గరకి వెళ్ళగా "నీవు మళ్ళీ అంబరీషుడి దగ్గరకే వెళ్ళి ప్రార్థించు" అని చెప్పాడు. దుర్వాసుడు వెళ్ళి అంబరీషుడి పాదాలపై పడ్డాడు. అంబరీషుడు ఆ మునిపై కోపించలేదు. ఆయన్ని విడిచి పెట్టమని సుదర్శన చక్రాన్ని ప్రార్థించాడు. అంబరీషుడి క్షమాగుణం వల్ల దుర్వాసుడు బ్రతికి బయటపడ్డాడు.

దుర్యోధనుడు అరణ్యాలలో ఉన్న పాండవులను అవమానించటానికి ఘోషయాత్ర నెపంతో వచ్చి తన రాజ్యభోగాలు ప్రదర్శించాడు. చివరకు చిత్రసేనుడి చేతిలో చిక్కి బంధించబడితే ధర్మరాజు విడిపిస్తాడు. అంతక్రితం దుర్యోధనుడు మాయాజ్యూదంలో పాండవుల రాజ్యాన్ని అపహరించటం, ద్రౌపదిని నిండు సభలో అవమానించటం ఇవన్నీ చేసినా ధర్మరాజు క్షమించాడు. మనం అన్నదమ్ములం నూట ఐదుగురం అని దుర్యోదనుడితో అన్నాడు.

అంతేకాదు పాండవులు ఇంటలేని సమయం చూసి సైంధవుడు ద్రౌపదిని చెరబట్టబోతాడు. భీముడు అతడిని బంధించి సంహరించబోగా ధర్మరాజు వారించాడు. "ఇతడు మన ఆడబడుచు దుస్సల భర్త" అని గుర్తు చేశాడు. ధర్మరాజు క్షమాగుణమే అతని ప్రాణం కాపాడింది.

ఇలాచెప్పుకుంటూ పోతే ఇలాంటి ఉదాహరణలు ఎన్నో! నేటి కాలంలో కూడా మానవులు ఎన్నో తప్పులు చేస్తారు.అవతలి వారు ఆ తప్పులను క్షమించి విడిచి పెట్టటమే ఉన్నతులను చేస్తుంది. క్షమాగుణమే మనశ్శాంతిని కలుగచేస్తుంది. పగ ప్రతీకారాలు మనశ్శాంతిని దూరం చేస్తాయి.

* జీవితమనేది విందుభోజనం. అందులో తీపి, కారం పులుపూ ఇలా అన్ని రకాల పదార్థాలు వడ్డించబడతాయి. ముందో వెనకో అందరూ వాటిని రుచి చూడవలసిందే.

* విచక్షణలేని ఆచరణ వాసనలేని పూవు లాంటిది. అది చూచే వారికి బాగానే వున్నా తనకు మాత్రం ఆత్మతృప్తిని కలిగించదు. పైగా అది ఎన్నటికీ పూర్ణఫలితాన్ని యివ్వజాలదు.

* చాలాసార్లు విజయమనేది మునివ్రేళ్లకు చిక్కి జారిపోతుంటుంది. దానిని చేతితో ఒడిసి పట్టుకోవాలంటే మాత్రం ఇంకొంచెం ముందుగా బయలుదేరాలి.మాత్రం ఆత్మతృప్తిని కలిగించదు. పైగా అది ఎన్నటికీ పూర్ణఫలితాన్ని యివ్వజాలదు.

* కారణం లేకుండా దూషించే వాడిని మనం ద్వేషించడం దేనికి? ఆత్మహత్య చేసుకుంటున్న వాడిని ఎవరైనా హత్యచేయాలనుకుంటారా!

# మహాభారతంలోని నీతి కథలు

.. డాక్టర్ కె. సత్యనారాయణ
సెల్: 9440732210

జీవితంలో ఎన్ని సాధించినా, ఏమి చేసినా, సత్య సంధత, ధర్మానుసరణ తప్పకుండా ఉండాలి. ధర్మోరక్షతి, రక్షితః అని ఆర్యోక్తి. ధర్మాన్ని రక్షిస్తే ఆ ధర్మం మనల్ని రక్షిస్తుందని దాని భావం. ధర్మానుసరణ వలన వ్యక్తి కానరాని, ఊహించని ప్రయోజనాన్ని పొందుతాడని ఈ మహాభారత కథ బోధిస్తుంది.

కురుక్షేత్ర యుద్ధం తరువాత ధర్మరాజు హస్తినాపుర సామ్రాజ్య పట్టాభిషిక్తుడై చాలా కాలం రాజ్యపాలన సాగిస్తాడు. శ్రీ కృష్ణ బలరాముల అవతారం పరిసమాప్తి ధర్మరాజులో ఒక వివేచనను రేకెత్తించింది. వెంటనే మనుమడైన పరీక్షితునకు రాజ్యభారం అప్పగించి వానప్రస్థాశ్రమానికి బయలుదేరాడు. ధర్మరాజు తన భార్యను, తమ్ములను, వెంటబెట్టుకుని నడచిపోతుండగా ఒక శునకం కూడా వారితో వచ్చి చేరుతుంది. మార్గం మధ్యలో అగ్నిదేవుడు ప్రత్యక్షమై అర్జునునికి తాను ఇచ్చిన గాండీవాన్ని తిరిగి ఇచ్చివేయమనగా అర్జునుడు ఆ ప్రకారంగానే చేస్తాడు. వారి ప్రయాణం హిమాలయాలు దాటి మేరుపర్వత సమీపానికి చేరుతుంది. మొదటగా ద్రౌపది ప్రయాణం హిమాలయాలు దాటి మేరుపర్వత సమీపానికి చేరుతుంది. మొదటగా ద్రౌపది సొమ్మసిల్లి ప్రాణాలు విడుస్తుంది. ఆమెను చూచిన భీముడు "ధర్మనందనా! ఈమె ఎన్నడూ ధర్మవిరుద్ధంగా నడవలేదు కదా. ఎందుకిలా జరిగింది" అని అడుగుతాడు. అప్పుడు ధర్మరాజు నాయనా ఈమెకు అర్జునుని మీద కొంత ప్రత్యేక అభిమానం ఉంది" అని బదులిస్తాడు. ఆ శునకం వీరిని వెంబడిస్తూనే ఉంటుంది. కొంత దూరం సాగిపోయే సరికి సహదేవుడు ప్రాణాలర్పిస్తాడు. అప్పుడు ధర్మరాజు భీమునితో "వీడికి నా అంతటి వాడులేడనే అహంకారం లేశమాత్రంగా అయినా ఉంది" అని ముందుకు సాగుతాడు. ఆ తర్వాత కొద్దిసేపటికే నకులుడు పడిపోతాడు. "తనలాంటి అందగాడు ఈ ప్రపంచంలోనే లేడనే అహంకారం వీడికుంది" అని అంటాడు ధర్మరాజు. ఆ తరువాత అర్జునుడు నేలకొరుగుతాడు. అది చూచిన ధర్మరాజు, తమ్ముడూ, భీమసేనా! కౌరవులందర్నీ ఒక్కరోజులో తుద ముట్టిస్తానని బీరాలు పలికి ఆ మాట నిలుపుకోలేక పోయాడు. అంతేగాక ధనుర్విద్యలో తాను చాలా గొప్పవాడినని వీడి భావన" అనంటూ ముందుకు అడుగు వేస్తాడు. ఇంకా కొంత దూరం వెళ్లేసరికి "అన్నయ్యా!" అని భీముడు నేలకొరుగుతాడు. అప్పుడు "ధర్మరాజు భీముని చూచి నాయనా భోజన ప్రీతితోనూ, దానివలన వచ్చిన క్రోధ, అహంకారాలు నిన్ను ఈ దశకు తెచ్చాయి" అని అంటూ ముందుకు వెళ్లిపోతాడు. శునకం మాత్రం ధర్మరాజుని వెంబడిస్తూనే ఉంటుంది.

ఇంకా ముందుకు వెళ్ళగా ధర్మరాజుకి ఇంద్ర దర్శనం అవుతుంది. ఇంద్రుడు రథంతో ఎదురేగి "ధర్మనందనా! ఈ రథం ఎక్కి అమరలోకం చేరు. నీ భార్యా తమ్ముళ్ళు అక్కడే ఉన్నారు" అని ఆహ్వానిస్తాడు. ఆ మాటలను విన్న ధర్మరాజు "ఓ మహేంద్రా! హస్తినాపురం నుండి నేను బయలుదేరినది మొదలు నా వెంట ఈ శునకం వస్తూనే ఉంది. కనుక ఈ శునకాన్ని కూడా అమరలోకానికి అనుమతించండి" అని ధర్మరాజు ప్రార్థిస్తాడు. చివరికి ధర్మరాజు పట్టిన పట్టు వదలక పోయేసరికి ప్రసన్న హృదయుడైన శునకరూపంలోని యమధర్మరాజు "ఓ కుంతీసుతా! నీ సర్వభూతాల యందు సమదృష్టి, ధర్మనిరతి మాకు ఆనందాన్ని కలిగించింది. అమరేంద్రునితో ఆ స్వర్గానికి

బయలుదేరి వెళ్ళు, నీకు శుభం కలుగుగాక!" అని యమధర్మరాజు అంతర్ధానమౌతాడు.

ఎంతటి మహామహులైనా ఏకాంతంగా ఉన్నప్పుడు స్త్రీలను దగ్గరకు రానిస్తే పతనం తప్పదని మహాభారతంలోని శకుంతలోపాఖ్యానంలోని మేనకా విశ్వామిత్రుల వృత్తాంతం చెప్తుంది.

విశ్వామిత్రుడు గాథె రాజు. సర్వశాస్త్రాల్లో పారంగతుడు, మహా పరాక్రమవంతుడు. ప్రజాహితంగా రాజ్యపాలన చేసినవాడు. కామధేనువు విషయమై బ్రహ్మర్షి వశిష్ఠునితో తలపడిన ధైర్యశాలి. క్షత్రియ బలము కంటే బ్రహ్మబలమే బలమని గ్రహించిన విశ్వామిత్రుడు బ్రహ్మర్షి పదాన్ని సంపాదించడం కోసం కఠోరదీక్షతో ఘోరమైన తపస్సును ప్రారంభిస్తారు. ఆయన తపోదీక్షను పరీక్షించదలిచిన ఇంద్రుడు అప్సరసలలో తలమానికమైన మేనకను పిలిపించి "ఓ మేనకా! నీ రూప లావణ్య, విద్యా ప్రావీణ్యాలతో విశ్వామిత్ర మహర్షి తపస్సమాధికి భంగం కలిగించాలి" అని అంటాడు. అందులకు మేనక "ప్రభూ! మీ మాటకు ఏనాడూ ఎదురు చెప్పింది లేదు. విశ్వామిత్రుల సామర్థ్యం మీరెరుగనిది కాదు. ఆయన తపస్సు, తేజస్సు మిక్కిలి గనమైనవి. వీటికి మించి ఆయన క్రోధమూర్తి. వశిష్టుల వారి కొడుకులందర్నీ సంహరించాడు. పతంగుని చేత పట్టుబట్టి యజ్ఞం చేయించాడు. త్రిశంకునికి మరో స్వర్గాన్ని నిర్మించాడు. తన తపస్సుకి అంతరాయం కల్గిస్తుందని నదీ ప్రవాహాన్ని శబ్దరహితంగా ప్రవహింపజేసిన శక్తిశాలి. ఆయన కన్నులెర్రజేస్తే ముల్లోకాలూ గజగజ వణుకుతాయి. అటువంటి మహాశక్తి సంపన్నుడి దగ్గరకు నన్ను పంపుతున్నారు. మీ మాట కాదనకుండా వెళతాను అయితే పంచభూతాలు, మన్మధుడు నాకు సహకరించేలా చూడాలి" అని అంటుంది. దేవేంద్రుడు ఆమె అడిగిన వాటన్నిటికీ తన అంగీకారాన్ని తెలియజేస్తాడు.

మేనక విశ్వామిత్రుడని తపోవన వాటికకు వచ్చేసరికి అక్కడి ప్రకృతి అంతా పరమశోభాయమానంగా మారిపోతుంది. పక్షుల కిలకిలా రాగాలతో ఆ ప్రాంగణమంతా వింత సంగీతానుభవం కల్గుతోంది. మేనక తన అత్యద్భుతమైన అభినయ విన్యాసాలతో విశ్వామిత్రుని మనస్సును చూరగొన్నది. కామక్రోధాలను జయించి బ్రహ్మర్షి పదం చేరాలనే ఏకైక సంకల్పంతో తపస్సునారంభించిన విశ్వామిత్రుడు ఏకాంతంలో పైట జారిన మేనక వంటి అందాలరాశి కన్పించేసరికి సర్వస్వమూ మరిచిపోయి మదనతాపానికి లోనైతాడు. మేనకను దగ్గరకు తీసుకుంటాడు. పది సంవత్సరాల కాలం ఒక లిప్తకాలంగా గడిచిపోతుంది విశ్వామిత్రునికి. అప్పటికి ఆయనకు అర్థమైంది తాను కామాన్ని జయించలేదని. తక్షణమే మేనకను విడిచి తపోవనానికి వెళ్ళిపోయాడు విశ్వామిత్రుడు. ఇలాంటి ఎన్నో నీతి కథలకు ఆలవాలం మహాభారతం. మహాభారతంలో కన్పించని పాత్ర, కన్పించని మనస్తత్వం లోకంలో ఎక్కడా లేదంటారు. అందుకే "యదిహాస్తి తదన్యత్ర

యన్నే హాస్తి నతత్ క్వచిత్" అని ప్రశంసిస్తారు.

మానవజీవితంలో పెనువేసుకుపోయిన పాత్రచిత్రణ ఈ గ్రంథంలో దర్శనమిస్తుంది. దీనివల్లే కొంతమంది విద్వాంసులు భారతాన్ని గొప్ప మనస్తత్వాల కూడలిగా భావిస్తారు. సమాజంలో, జీవితంలో ఎలా నడుచుకోవాలో చెప్తుంది భారతం. ఈనాటి సమాజంలో మనకు కన్పిస్తున్న సమస్త బడుగులకు మహాభారతం చక్కని పరిష్కారాలను చూపుతుందనడంలో ఎలాంటి సంశయం అక్కరలేదు. అందుకే మనందరం మహాభారతాన్ని మళ్ళీ మళ్ళీ చదవాలి. ఆమూలాగ్రం అవగాహన చేసుకోవాలి. హృదయానికి పట్టేలా చదవాలి. చదివిన పిదప ఆచరణలో పెట్టాలి. అదే మనందరికీ శ్రీరామరక్ష.

శ్రీ విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వాములవారి రచనల్లో విశిష్ట రచన

# వీరకాళికాంబా శతకము

భావచ్ఛందోఽనుసరణ: కీ.శే. డా॥ వి.వి.యల్.నరసింహారావు (కందిమల్లయ్యపల్లె) బ్రహ్మంగారి మఠం ఆస్థాన కవి

## తత్త్వసిద్ధి

**తత్త్వమందె మనసు తగిలి, పోయెదమని**
**బెగడువడిరి తాము పెద్దలయ్యు**
**పతియె ఒల్లని సతి బ్రతుకయ్యేవారికి**
**కాళికాంబ! వీరకాళికాంబ! 408**

'తత్త్వ' మంటే ఆలోచనారీతి, స్వభావము అనే సాధారణార్థాలు ఉన్నా 'పరమాత్మ' అనే విశేషార్థం కూడా ఈ పదానికున్నది. 'తత్+త్వమ్' - అతడే నీవు అనే అద్వైతార్థం దీనివల్ల సిద్ధిస్తుంది. తత్త్వాలు 25 ఉన్నాయి. వీటినే పంచవిశతి తత్త్వాలు అంటారు. వాటి వివరణ అంతా ఇక్కడ ఆవశ్యకం కాకపోయినా 'పరమాత్మ' అనే అర్థం మాత్రం అవశ్యం గ్రహించతగింది.

అనుభవజ్ఞులైన పెద్దలు కూడా పరమాత్మ యందే మనసు నిల్పి సుదూరం పోయి పరమాత్మను దర్శించే మార్గం తెలియక విచారపడసాగారు. పరమాత్మకు నేనంటే ఇష్టం లేదేమో అని జీవుడు విచారపడటమూ కద్దు. భర్త ఇష్టపడని ఇల్లాలి బ్రతుకువలె భగవంతుడు ఆదరించని భక్తుని బ్రతుకు తయారౌతుంది.

**తత్త్వసిద్ధిగాంచ తరముగా దెవరికి**
**చిత్తశాంతి లేక చిక్కువడిరి**
**తాపమందువాడు తానెట్టి గురువయా?**
**కాళికాంబ! వీరకాళికాంబ! 409**

పరమాత్మ సందర్శం ఒక విధంగా అసాధ్యమైందే. గురువలుమని చెప్పుకొనే వారికి కూడా ఇది అసాధ్యమే పరతత్త్వ సందర్శనం కాక తపించిపోతూ ఉంటారు. తాపం పొందేవాణ్ణి గురువని అంగీకరించం కదా!

**చాలతప్పు సుమ్ము సద్గురు దూషణ**
**గురుల సతుల తిట్టగూడ దెపుడు**
**ఇన్నిటికి మూల మిల్లాలు గదా!**
**కాళికాంబ! వీరకాళికాంబ! 410**

గురువుల్లో సద్గురువు లుంటారు. వారు కోపతాపాలకు అతీతులు. వారు అంతగొప్పవారు కావడానికి వారి సతీమణులు కూడా కారణం. అందువల్ల గురువుల సతులను కూడా తిట్టకూడదు. సద్గురువులను తీర్చిదిద్దేవారు సద్గురువుల ఇల్లాండ్రే. ఈ మాటవల్ల బ్రహ్మేంద్రుడు తన యిల్లాలైన గోవిందమాంబను జ్ఞప్తిచేసుకుంటున్నాడనుకోవాలి.

**మోహతత్త్వగతుల ముడివడబోదయా**
**మున్ను తత్తవిదులె మునిగినారు**
**తన్ను దెలియకున్న దైవము లేడయా**
**కాళికాంబ! వీరకాళికాంబ! 411**

భార్యామోహంతో బ్రహ్మేంద్రుడీ విధంగా పలికాడను కోవడం తప్పు. చిరకాలంగా తత్త్వం తెలిసిన పెద్దలే మోహవాగురలలో చిక్కుకున్నారు. మోహంతో ఏదీ ముడివడదు. సాధ్యం కాదు. తన్ను తాను తెలుసుకొంటే మోహం నుంచి బైటపడినట్లే. ఆత్మజ్ఞానం లేకపోతే భగవంతుని అస్తిత్వమే నీకు అనుమానంగా మారుతుంది. ఇది చాలా ప్రమాదం.

**దేశదేశములను దేవళమ్ములు గాంచ**
**తిరుగుచుండ్రు కాశి వఱకు నడచి**
**కాశినాథు డొక్క దేశాన నుండునా?**
**కాళికాంబ! వీరకాళికాంబ! 412**

"కాశికి పోవలెనా? తీర్థము మోసుకురావలెనా? కాశీతీర్థము కన్నుల నున్నది" అనే తత్త్వం ఆత్మజ్ఞానులు పరమాత్మ సర్వాంతర్యామిత్వాన్ని స్పష్టం చేస్తుంది.

బహుదేశాల్లోని దేవాలయాలు దర్శించేందుకు ఊరకే తిరగవద్దు. కాశీనాథుడైన శివుడు ఒక్కకాశీలోనే ఉంటాడా? సర్వాంతర్యామియై అంతటా నిండి ఉంటాడు. ఈ జ్ఞానం కలిగితే తీర్థయాత్రల బాధ ఉండదు.

**చెంతనుండు నట్టి సిద్ధుని తెలియక**
**బుద్ధిలేకపోయి భూమి తిరిగె**
**భూమి తిరుగు ఫలము వేమన కెఱుకయే**
**కాళికాంబ! వీరకాళికాంబ! 413**

అన్నీ తెలిసిన సిద్ధుడు మన చెంతనే ఉంటే తెలుసుకోలేక - తెలివి మాలి దేశదేశాలు తిరిగినట్లుంటుంది. ఇట్లా దేశ సంచారం వల్ల కలిగే ఫలం వేమనయోగి వంటి వారికి బాగా తెలుసు. వేమన అనుభవజ్ఞానయోగి కదా!

**వీర వేమన అదె తారకంబై నిల్చె**
**తెరలు దించి బయల దేవు గాంచె**
**నిజము వేఱు, నరుల నిందలు వేఱయా**
**కాళికాంబ! వీరకాళికాంబ! 414**

జీవులను తరింపజేసే తారకమంత్రంలా కనిపిస్తాడు ఆ మార్గంలో వీరుడైన వేమన. దేవుడికి జీవుడికీ మధ్య నున్న అడ్డుతెరలు తొలగించి బట్టబయలున భగవంతుణ్ణి చూడగలిగాడు. నిజమైన విషయమిట్లా ఉండగా వేమనను పలునిందలకు గుఱిచేసిన సందర్భాలూ ఉన్నాయి. సత్యం గ్రహించాలి లోకులు.

**నీరు బిందువాయె, నారాయె బిందువు**
**నారు, నీరు సందు చేరుమాయ**
**ఔర మాయచేయు అద్భుతంబులవెన్నొ!**
**కాళికాంబ! వీరకాళికాంబ! 415**

'నీరే ప్రాణాధారము; ఆ నీరు బొట్టుగా మారింది. ఆ బొట్టు పంటనియ్యగల 'నారు' గా మారింది. ఈ నారుకు ఆ నీరుకు మధ్య ఉన్న మాయ తెలుసుకుంటే సృష్టి రహస్యం తెలుసుంది. సృష్టి సంబంధమైన ఈ మాయ చేసే ఆశ్చర్యకరమైన విషయాలు ఎన్నెన్నో.

**అద్భుతములు నమ్మి అసలైన దరయక**
**భ్రమసి మోహములను పట్టువడిరి**
**మోహపాశములన మొదలువెన్ తెవులౌను**
**కాళికాంబ! వీరకాళికాంబ! 416**

మూలతత్త్వం తెలుసుకోకుండా వింతలు విశేషాలు మాత్రమే నమ్ముకుంటే మోహపు త్రాళ్ళలో కట్టువడినట్లే. మోహపు త్రాళ్ళే ముందుగా జీవుణ్ణి బంధించి, నశింపజేస్తుంది. మోహమనేది పెద్దతెగులు.

**మాయచేతనె అనుమానమయ్యెనుగాని**
**కానలేకపోయె తాను దేని**
**గురుతు పట్టవలయు గుణములకు నతీతు**
**కాళికాంబ! వీరకాళికాంబ! 417**

కేవలం అద్భుతాలను మాత్రమే నమ్మి అసలైన తత్త్వాన్ని అర్థం చేసుకోలేకపోవటమే వచ్చిన ప్రమాదమంతా. అందువల్ల సత్యవిషయాన్ని దేన్నీ తాను తెలిసుకోలేక పోతున్నాడు జీవుడు. గుణాతీతుడైన పరమాత్ముణ్ణి గుర్తుపట్టి తత్త్వం తెలుసుకొంటే జ్ఞానం కలుగుతుంది. గుణములన్నప్పుడు సద్గుణాలు, దుర్గుణాలు రెండూ ఉంటాయి. ఈ రెంటికీ అతీతంగా ఉండేవాడే పరమాత్ముడు. ఆ పరమాత్మ తత్త్వాన్నే గుర్తించాలి - ఇది బ్రహ్మేంద్రుని ప్రబోధం. మహిమలు, అద్భుతాలు, తాత్కాలికమైనవే అని గుర్తించాలన్నాడు గురుదేవుడు.

**వెలుగె దివ్వె, దాని పేరు ఆపోజ్యోతి**
**ప్రకృతి దోషములను పాఱదోలు**
**దాని దాపునందు తాపంబు లడగును**
**కాళికాంబ! వీరకాళికాంబ! 418**

దీపం వెలిగింది. ఈ దీపం నీటి నుండి వెలిగింది. అందుకే దీన్ని ఆపోజ్యోతి అంటాము. విద్యుద్దీపకాంతి నిస్తుందిది. ప్రకృతిలో ఉండే ప్రమాదాలు దోషాలు ఇది దూరం చెయ్యగలదు. దీని దగ్గర్లో మనస్తాపాలు మాయమౌతాయి. ఒక విధంగా ఇది పరమాత్మ జ్యోతియే.

**తెలివి గలుగువారి తెలియుడీ పెద్దలు**
**ఫలము వెంట వెంట తెలియగలదు**
**బుద్ధి పుట్టజేయు మూలమౌ పెద్దమ్మ**
**కాళికాంబ! వీరకాళికాంబ! 419**

పైపద్యములో చెప్పబడిన ఆపోజ్యోతి యోగసాధకుడు బ్రహ్మమును దర్శించు స్థితిలో సహస్రారమందు కనుగొను జలజ్యోతి. ఈ విషయము అవ్వయతారకోపనిషత్తు స్పష్టం చేస్తుంది. "సహస్రారే జలజ్యోతిర్వా.... అంతర్లక్ష్యం భవతి'' ఇట్టి తురీయస్థితిని పొందాలంటే వయస్సుచే పెద్దలైన వారు కూడ జ్ఞానంచే పెద్దలైన వారి ద్వారా తెలుసుకోవాలి. అట్లా తెలుసుకుంటే ఫలం వెంటవెంటనే తెలుస్తుంది. అట్లా తెలుసుకునే బుద్ధి మహామాత అయిన కాళియే కలిగిస్తుంది. అందరికీ ఆమె పెద్దమ్మగదా!

**కంట కనుగొనుండు ఇంటి పెద్దమ్మను**
**లోని కన్ను తెఱచి లోకమరయ**
**బయల తోచె బాలుడయ పౌరముక్కంటి**
**కాళికాంబ! వీరకాళికాంబ! 420**

ఇంటికి పెద్దదిక్కు పెద్దతల్లి మహాకాళియే ఆమె కాలస్వరూపిణియైన యోగమాతగా కనిపిస్తుంది. అంతర్నేత్రం విచ్చుకుంటే బాహ్యలోకంలో బ్రహ్మము బట్టబయలు నందే కనిపిస్తాడు. శివుడు అందాల బాలుడై కనిపిస్తాడు. బ్రహ్మేంద్రుని తత్వాలలో "కాశీతీర్థము కన్నుల నున్నది. బేసికన్ను శివకాశిగ నున్నది'' అన్నప్పుడు కూడా భావం ఇదే.

**ఏమికానరైరి యీ వెఱ్ఱి మనుజులు**
**మఱ్ఱి విత్తనంబు మాయకాదె?**
**అఱ్ఱుమోయలేదు అవ్విధి చెయంబు**
**కాళికాంబ! వీరకాళికాంబ! 421**

సృష్టి చిత్రం తెలసుకోవటం అందరికీ సాధ్యం కాదు. అమాయకులైన లోకులు మఱ్ఱివిత్తనంలో మహావటవృక్షం ఇమిడి వుందని తెలుసుకోగలరా?

"విత్తనంబు మఱ్ఱివృక్షంబునకు నెంత?'' అనే వేమనయోగి కూడా లోకాన్ని ప్రబోధం చేసేందుకు ప్రయత్నించాడు.

సృష్టికర్త అయిన విధి చేష్ట సామాన్య మానవులకు దుర్భరంగా కనిపించవచ్చు. అఱ్ఱుమోయలేదు ఆ విధి చెయంబు'' అంటే అదే అర్థం.

**అవును కాదనంగ అది మీకు సాక్షియా?**
**శౌనకాది మునులు జయము గనిరి**
**కాన చెప్పునట్టి కారుణ్యమిట్టిదే**
**కాళికాంబ! వీరకాళికాంబ! 422**

విత్తనంలో మహావృక్షం ఇమిడి ఉన్నదనేది అప్పటికప్పుడు కళ్ళకు కనిపించకపోవచ్చు. ఊడలమఱ్ఱి కనిపించినప్పుడు అంగీకరిస్తాం. మహామునులైనవారు తమ తపశ్శక్తితో భవిష్యద్విషయాలు కూడా గ్రహించగలుగుతారు. శౌనకుడు మొదలైన మునులు సాధించిన తపోవిజయం అదే. ఓపికగా కానలో తిరిగి ప్రకృతి రహస్యాలు తెలుసుకోవాలి. అడవి మానవుడికి చేసే ప్రభోదం దయతో ఉండాలనేదే. కనిపించిన ప్రతి వృక్షాన్ని నరుక్కుంటూ పోతే ఎంతటి అడవైనా అదృశ్యమౌతుంది. కనుక కరుణ ముఖ్యం. **(సశేషం)**

# రాగ ద్వేషాలుంటే జీవుడు.. లేకుంటే దేవుడు

................ ఆంధ్రరత్న జి.వి శేషారెడ్డి ................

జీవుడే దేవుడు. మానవత్వం పరిమళిస్తే దైవత్వం. ఇదే వేదాంతం. వేదాలలో సారము. ఒక సినిమా పాటలో ''జగమే మాయ బ్రతుకే మాయ, వేదాలలో సారమింతేనయా'' ఇది నిజము కదా! మనిషికి తెలియనిది లేదు ఆలోచిస్తే కావలసినంత సమాచారాన్ని మహానుభావులు వారి అనుభవాల ద్వారా తెలియచేశారు. మనిషి మహీదరుడవుతాడు, మానవుడు మాధవుడవుతాడు వాస్తవాన్ని యదార్థాన్ని పట్టుకొన్నపుడు వస్తువు కాదు వాస్తవము కావాలి, పదార్థము కాదు యదార్థము కావాలి. స్థితప్రజ్ఞుడు, నిశ్చలుడు, అవాస్తవమైన, తాత్కాలికమైన రాగద్వేషాలను జయిస్తాడు దేవుడవుతాడు. ఉన్నస్థితి నుంచి ఉన్నతస్థితికి వెళ్ళవచ్చు అని ప్రతి మానవుడునికి తెలుసు. ఉన్నత స్థితికి వెళ్ళాలనే కోరికకూడ ఉంటుంది. ఆస్థితికి వెళ్ళడానికి పరిస్థితిని కల్పించుకొని నిశ్చల స్థితికి వెళ్ళాలి. ఆలోచనను ముద్రించినపుడు అసలు రహస్యము తెలుస్తుంది. మేరు పర్వతాన్ని చిలికినపుడు దేవతలకు దక్కవలసిన అమృతము, విషమువచ్చిన తర్వాతనే దక్కింది. అదే విధంగా మనిషి తనకున్న ఆలోచనలను మదిస్తే, శుద్ధమైన మది ఏర్పడి శాశ్వితమైన ఆనందనిదిని కనుగొనగలడు. ఆరాటము ఉన్నపుడు పొరాడితేగాని ఫలితము రాదన్నది సత్యం.

మానవజన్మకు పరమార్థముంది. ఆ పరమార్థము తెలుసుకొన్నవాడు పరమార్థన్ని ప్రత్యక్షంగా చూడగలడు. మానవుడు సాధించలేనిది ఏదిలేదు. నర, నారాయణులు సమానులు అన్నది వేదాంత రహస్యము. గీత సారాంశము ఇదేకదా! గీతాచార్యుడు. భగవాన్ శ్రీకృష్ణుడు గీతలోని 18 అధ్యాయాలలో అర్జునుడు ఎవరు, తనశక్తిఏమిటి అన్న విషయాన్ని తెలియచేసి అర్జునుని మదిలో ఉన్న రాగద్వేషాలన్న బడభాగ్నిని 18 అధ్యాయాల గంగలో ముంచి కార్యోన్ముఖుని చేయలేదా! మానవులందరు దైవాంశ సంభూతులన్న విషయాన్ని తెలుసుకోవాలంటే మనలో దాగివున్న అతీతశక్తులను వెలికితీయవలసిందే కదా! లౌక్యంతో సౌఖ్యం అశాశ్వితం. అశాశ్వితాలైన వాటికోసం అర్రులు చాచడము వెర్రితనము. మనకు తెలిసింది అల్పము తెలుసుకోవలసింది అనంతము మన జ్ఞానము సముద్రములోని నీటిచుక్కలాంటిది.

ఆలోచనలకు విశ్లేషణ జరిగినపుడు మాత్రమే ఆదికి, అంతానికి ఆనవాళ్ళు దొరకుతాయి. విశేషణతో విశదీకరణము, విశదీకరణముతో స్పష్టత, స్పష్టతతో నిర్ణయీకరణ, నిర్ణయీకరణతో నిశ్చలత్వము, నిశ్చలత్వముతో నిర్మోహత్వము, నిర్మోహత్వముతో చేతనత్వాన్ని చేరుకోవచ్చు. చేతనస్థితి రాగద్వేషాలు లేని సాంత్వనస్థితిని పొందవచ్చు. ఈ స్థితిలో ప్రతి అణువు పరమాత్మను, పరమాత్మే ఎందెందు వెతికిన అందందు కలడన్న ప్రహ్లాదస్థితికి చేరుకోగలము. ఈ స్థితిలో మదిలో ఉన్నది ఓంకారత్వము. ఆ పరమేశ్వరుని రూపం అదే శివం, అంటే జీవమే శివమన్న

బ్రహ్మతత్వాన్ని చేరుకోగలడు. ఇదేకదా శివతత్వం, నారాయణతత్వం, కృష్ణతత్వం, గీతాసారాంశం.

వేదాలలోను, ఉపనిషత్తులలోను, భగవత్ గీతలోను బోధించిన వేదాంతము రాగ, ద్వేష మోహరహితము, మానవజన్మను ఉద్దరించడానికి లిఖింపబడిన ఆధ్యాత్మికపు నిధులు. "అహింసో పరమోధర్మహ" అనిభావిస్తే మానవజన్మకు మోక్షము కలుగుతుంది మోక్షసిద్ధికి మనిషి మది ప్రేమకు నిధికావాలి, ప్రేమను పెంచాలి, పంచాలి. స్వార్థాన్ని విడనాడాలి. సతసింగ్ పరిస్థితిని పెంచుకోవాలి. ప్రతి మనిషిమీద పరిస్థితుల ప్రభావము ఎక్కువగా ఉంటుందన్నది నగ్నసత్యం. అందుకే ఇంగ్లీష్‌లో Criminals are not born, they are made ఇలా చెప్తుంది. అందుకే మన ఆలోచనలను ప్రభావితం చేసేది స్థితి, పరిస్థితి సత్యసంగముల వల్ల మోడు బారిన బ్రతుకులు చిగురిస్తాయి. సత్‌చిదానందా రహస్యాన్ని సత్‌సంగమ విశ్లేషణలో మనకు ప్రసాదముగా దొరుకుతుంది. విశ్లేషకులు, మహానుభావులు, ఆధ్యాత్మికవేత్తలు, ధార్మికులు కాబట్టి వారినోటి నుండి జాలువారు ప్రతి వాక్యము పరిశుద్ధవాక్యము, పవిత్రమైన ఆధ్యాత్మికత అన్న గంగతో ప్రక్షాళనము చేయబడి ఉంటుంది. స్వామి వివేకానందుడు, శ్రీరమణమహర్షి, అరవింద మహర్షి, రామకృష్ణ పరమహంస, జిడ్డు కృష్ణమూర్తి, ప్లాటో, సోక్రటీస్ లాంటి ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన ఆధ్యాత్మిక వేత్తల ప్రసంగాలు అమృత బాండాగారాలు కాదా! మనకున్న దుర్గుణాలైన కామము, క్రోదము, మదము, మాత్సర్యం, ద్వేషంలాంటి వాటిని జయించడానికి వారి బోధనలను అనుసరిస్తే చాలదా! మనిషికి జ్ఞానముంది, జ్ఞానోదయం కావాలి తలంపులు ఉన్నాయి. తలంపులు తెచ్చే తలవంపులు కాకుండ ఉండాలి. మానవజన్మ మహనీయమని భావిస్తే, కర్మలను ప్రతిఫలము ఆశించకుండ భగవత్‌గీతలో అర్జునునికి జ్ఞానోదయము అయిన తర్వాత అర్జున స్థితికి మానవుడు వెళ్ళితే మానవుడు మాధవుడు కాగలడు.

నానాటి బ్రతుకు నాటకమన్న విషయాన్ని ప్రతినోట పలికించాడు అన్నమయ్య ఎందుకని! దీని పరమార్థాన్ని తెలుసుకోమని కదా! ఆదిశంకరాచార్యుల వారి భజగోవిందము ప్రతి ఇంట వెలసిన ఆధ్యాత్మిక పంట. ఆ ఫలాన్ని మనము పొందాలంటే రాగద్వేషాలు మితిమీరకూడదు కదా! ఓంకార మంత్రాన్ని ఉచ్చరించినపుడు ఒంటిలో శివతత్వము భజగోవిందము, భజగోవిందమని తపిస్తుంది కదా! అన్నమయ్యను ఆకలింపు చేనుకొని ఆదిశంకరాచార్యులవారిని ఆవాహన చేసుకొని శ్రీ వీరబ్రహ్మేంద్రస్వాములవారి కాలజ్ఞానాన్ని కనులముందుకు తెచ్చుకొంటే మన జీవితాలను సార్థకము చేసుకోవడము ఎలా అన్నది తెలియదా! రాగద్వేషాలు లేని స్థితి స్థితప్రజ్ఞత కదా! అన్ని తెలిసి మానవుడు చేయవలసింది చేయుడంలేదు. వదలవలసినవి వదలడంలేదు. మానవజన్మ మానవుని మనుగడకు పరాకాష్ఠ, అందుకే భగవంతుడు మనకు కల్పించే కష్టాలను, పరీక్షలుగా భావించి కర్మ సిద్ధాంతాన్ని అనుసరిస్తే మంచిని, నీతిని, ధర్మాన్ని, అహింసను విడనాడకుండ గమ్యాన్ని చేరుకోవాలి. ప్రకృతిలోని ప్రతి మొక్క తన కోసము బ్రతకడములేదు. మీ కోసము నేను అంటే ప్రతి మొక్క చెట్టు పువ్వులను, ఫలాలను, తన శరీరములో భాగాన్ని

మనకోసం చిరునవ్వుతో ఆనందంగా అందిస్తున్నపుడు మొక్క మౌనంగానే మనం ఏమినేర్చుకోవాలనో తెలియచేస్తున్నదికదా! మొక్క వాతావరణ కాలుష్యాన్ని అరికడుతుంది. మనందరికి కావాలిసిన ప్రాణశక్తిని (ఆక్సిజన్‌ను) ఇచ్చి కార్బన్‌డయాక్సైడ్‌ను పీల్చుకొంటుంది. మనందరికి ఆధారమైన నీటిని మేఘాలను ఆకర్షించి వర్షము వచ్చేటట్లు చేస్తాయి. ఇవన్ని తను అంటే మొక్క ఏమి ఆశించి చేస్తున్నది. తనకు శత్రువులంటులేరు అందరు ఆప్తులే. ఇన్ని విశిష్ట గుణాలున్న చెట్లను పూజించడము హిందు సంప్రదాయము యొక్క గొప్పతనము కాదా! పూజకు నోచుకొనే పువ్వు పరిమళాన్ని అందరికి ఇస్తుంది. పవిత్రతను చాటుతుంది. తేనెటీగకు తేనెను తయారు చేయడానికి కావలసిన మకరందాన్ని ఇస్తుంది.

ఆలోచిస్తే అంతా మిద్యే, భ్రమే, నాటకమే, అయిన మనిషికి ఆరాటం, బ్రతుకంతా పోరాటం. నానాటి బ్రతుకు నాటకం అని తెలిసిన బ్రతుకుపోరాటం ఆగదు. కాని ఈ పోరాటం గమ్యంకోసం అయితే ప్రతి మనిషి జీవితము సార్థకము కాదా! ప్రపంచాన్ని జయించిన అలెగ్జాండర్ చక్రవర్తి చివరిదశలో నేను చక్రవర్తినికాదు ఎందుకంటే నాలోని అరిషడ్ వర్గాలను జయించలేకపోయానని వాపోయీ తను చనిపోయిన తర్వాత తన రెండు చేతులు నిట్టనిలువుగా కనిపించేటట్టు పూడ్చుమని, నేను చనిపోయిన తర్వాత ఖాళీచేతులతో వెళుతున్నాను చూడమని తెలియచేయటానికని తెలిపినట్లు చరిత్ర తెలుపుతుంది కదా! అందుకే ప్రతి మనిషి జీవితము ముగింపు ప్రారంభమయితే తనజీవితానికి సార్థకత పొందవచ్చు. మనిషి మంచిగుణాలకు, చెడుగుణాలకు రంగరింపు దేవతలు, రాక్షసులు సాగరమదనము చేసినపుడు విషము, అమృతము రెండు వచ్చాయి. అదే విధంగా మనిషి, తన ఆలోచనలను మధనము చేస్తే అమృతత్వంతో కూడుకున్న ఆలోచనలు పొందగలడు. రాగద్వేషాలకు దూరము కాగలడు, రజోగుణాన్ని విడనాడి తమోగుణాన్ని పెంచుకొని తపఃసంపన్నుడు కాగలడు కదా! తనువు చాలించిన తర్వాత పంచభూతమిళితమవుతుందని మరణంలేని ఆత్మజీవుడే దేవుడున్న స్థితికి చేరుకొని, సాంత్వనస్థితి, సత్‌చిదానందస్థితి కదా! ఆత్మకు అంతరాలులేవు. ఈ విషయాన్ని అర్థము చేసుకొన్న వాడు సత్ చిదానందా స్వరూపుడేకదా!

అసూయ, ద్వేషం మనిషిని పతనము చేస్తాయన్నది నగ్నసత్యం. సకారాత్మకతతో ప్రేమతత్వాన్ని పెంచుకొని రాగద్వేషాలను, అసూయ ఆక్రోషాలను అదుపులో ఉంచుకొని ఉన్నతస్థితిని పొందవచ్చు. ప్రేమనిధి తరగని పెన్నిది. ఎవరిసన్నిది ప్రేమ సన్నిదో అదే దైవత్వానికి వారధి. శాంతి సౌభ్రాతుత్వాలకు సారధి. మానవజన్మ విచక్షణ జ్ఞాననిధి. విచక్షణతో వితరణను అనుసరించి ధర్మ, సత్యాల వ్రతమును నోచి దైవసన్నిదికి చేరువకాగలము. రాగ, ద్వేషాలు, అసూయ, ఈర్షలు మురికి కూపాలు, నరకానికి రూపాంతరాలు. అందుకే మానవుడు తననుతాను ప్రక్షాళనము చేసుకోవాలంటే తన్నుతాను ఉద్ధరించుకోవడానికి తను అంతర్ముఖి కావాలి. వివేకానందస్థితి పొందాలి. ధ్యానము అమృత బాండాగారం, శాంతి సౌఖ్యాల కామధేనువు ధ్యానము పరిపూర్ణత్వాన్ని నోసంగే వేదము, ముక్తిని ప్రసాదించే భగవత్‌గీత, ఉపనిషత్తుల సారము. ☐

# సనాతన ధర్మము - దాని విశిష్టత

...... స్వామి ముకుందానంద సరస్వతి, ఋషికేష్; 09410990829

### క్రోధము (కోపము)

మానవుడు వర్జింపవలసిన దుర్గుణములలో క్రోదము గూడ ముఖ్యమైనదియే. క్రోధము వలన అనేక అనర్థములు ప్రాప్తించును. క్రోధము నావహించిన వ్యక్తి మానసిక సంతులనమును కోల్పోయి, అనుచిత కార్యముల నాచరించును. క్రోధము వలన వైరము పెరిగి కలహములకు దారితీయును. క్రోదముతో నిండిన హృదయము పాషాన సమమయి, ఎదుటి వ్యక్తిని చంపుటకైనను వెనుదీయదు. క్రోధము వలన సంభవించు అనర్థమును దృష్టాంతపూర్వకముగ భాగవతము వర్ణించుచున్నది.

అంబరీష మహారాజు పరమభగవంతుడు, విష్ణుభక్తుడు. ఒకసారి ఆయన ఏకాదశి వ్రతము నాచరించెను. వైష్ణవ సంప్రదాయము ప్రకారముగా ద్వాదశిరోజు ఉదయమున నిర్ణీత సమయము లోపల ఆహారమును స్వీకరించి, ఉపవాసమును విరమణ చేయవలయును. ఆ నియమానుసారముగా అంబరీషుడు ద్వాదశి రోజున ఉపవాసమును విరమించుటకై ఆహారమును తీసికొన నుపక్రమించడంతో దుర్వాసమహాముని తన శిష్య సమేతముగ వేంచేసెను. అంబరీషుడు మహామునికి తగు మర్యాదలు చేసి ఆతిథ్యమును స్వీకరించమని కోరెను.

దుర్వాసముని అంగీకరించి, స్నానానుష్ఠానములు ముగించుకొని వచ్చెదమని చెప్పి, శిష్య సమేతముగ నదికి వెళ్ళిరి. ఇచట అంబరీషుడు వారి రాకకై యెదురు చూచుచుండెను. వారు శ్రీఘ్రముగా రారైరి. ఉపవాసమును విరమింపవలసిన నిర్ణీత సమయము దాటుచుండెను. అపుడు అంబరీషుడు ధర్మసంకటము నెదుర్కొనవలసివచ్చెను. పండితులను పిలిచి, పరిష్కారమార్గమును తెలియపరచుడని అంబరీషుడు కోరెను. పండితులు చక్కగా ఆలోచించి, ఒక నిర్ణయమును వెలిబుచ్చిరి. నీటిని స్వీకరించిన యెడల ఒక విధముగ ఉపవాసమును విరమించినట్లు అగును. ఇంకొక విధముగ ఇటు అతిథి సత్కారమునకు భంగము కలుగకుండ భుజింపనట్లు అగును. కావున నీటిని స్వీకరింపుమని పండితులు సలహానిచ్చిరి. అంబరీషుడు అదే విధముగా నొనర్చెను. ఇంతలో దుర్వాసముని వచ్చి తన దివ్యదృష్టితో విషయమును తెలుసుకొని, క్రుద్ధుడై అంబరీషుని అనేక విధముల నిందించెను. అతిథిని భోజనమునకు ఆహ్వానించి, అతిథికంటె ముందే భుజించిన నీచుడవని, నీవు భక్తుడవు గావని పరిపరి విధముల నిందించి, క్రోదోన్మత్తతతో తన ఒక జడను పీకి, దాని నుండి ఒక కృత్యను సృష్టించెను. ఆ కృత్య ఖడ్గధారియై అంబరీషుని చంపుటకై వచ్చుచుండ, వెనుక నుండి శ్రీ మహావిష్ణువు యొక్క సుదర్శన చక్రము వచ్చి, ఆకృత్యను వధించి దుర్వాసముని వైపు

వచ్చుచుండెను. దుర్వాసుడు భయకంపితుడై పలాయనము చిత్తగించెను. సుదర్శన చక్రము నిప్పులు కురిపించుచు అతనిని వెంబడించుచుండెను. దుర్వాసుడు బ్రహ్మలోకమునకు వెళ్లి, రక్షింపమని బ్రహ్మను వేడుకొనెను. బ్రహ్మదేవుడు తన నిస్సహాయతను వెలిబుచ్చెను. అంతట కైలాసమునకు వెళ్ళి, శ్రీశంకరుని శరణుజొచ్చెను. శంకరుడు గూడ తన నిస్సహాయతను వ్యక్తపరచి, శ్రీవిష్ణువునే శరణు వేడుమని సలహానిచ్చెను. దుర్వాసుడు వైకుంఠమునకు వెళ్ళి శ్రీమహావిష్ణువు యొక్క శరణు వేడుకొనెను. అంతట శ్రీవిష్ణువు "నీవు ఎవరికైతే అపచారము జేయబూనితివో, ఆ వ్యక్తి వద్దకు వెళ్ళి శరను వేడుకొనుము, ఆ వ్యక్తియే నిన్ను క్షమింప అర్హుడు" అని చెప్పెను.

అపుడు దుర్వాసముని అంబరీషుని వద్దకు వచ్చి, తన తప్పిదమునకు క్షమాపణ వేడుకొనెను. విశాల హృదయుడు, ప్రేమస్వరూపుడు, పరమ భాగవతోత్తముడైన అంబరీషుడు సుదర్శనచక్రమును అనేక విధముల స్తుతించి, శాంతింపమని ప్రార్థించెను. అంబరీషుని కోరిక ప్రకారము సుదర్శనచక్రము శాంతించి, దుర్వాసమునిని క్షమించి, వదలివేసెను. దుర్వాసుడు మూడు లోకములకు వెళ్ళి, మరల తిరిగివచ్చుటకు ఒక సంవత్సరకాలము పట్టెను. ఈ సంవత్సరకాలము అంబరీషుడు గూడ భుజింపక తన అతిథియైన దుర్వాసముని కొరకు వేచియుండెను. అంబరీషుడు ఎంత గొప్ప సదాచార సంపన్నుడో, ఎంత గొప్ప భక్తుడో దీనిని బట్టియే అవగతమగుచున్నదిగదా! అటువంటి మహాపురుషుని అకారముగా కోపించి, దుర్వాసుడు కష్టమును కొనితెచ్చుకొనెను. క్రోధము యొక్క పరిణామములు చాలా విషమముగా ఉండును.

అకటా! క్రోధము తనకు లొంగిన వ్యక్తిచేత ఏ పనిచేయింపదు ? (అనగా ఏ పనినైనను చేయించును అని అర్థము).

మానవుని యొక్క పతనమునకు క్రోధము ఎలా కారణభూతమగుచున్నదో శ్రీకృష్ణ పరమాత్మ భగవద్గీతలో విపులముగా వివరించినాడు :

శ్లో ॥ క్రోధాద్భవతి సమ్మోహః సమ్మోహాత్స్మృతి విభ్రమః॥
స్మృతిభ్రంశా ద్బుద్ధినాశో బుద్ధినాశాత్ ప్రణశ్యతి॥
(గీత. 2-63)

'క్రోధము వలన అవివేకమావేశించును. అవివేకము వలన మతిభ్రమ సంభవించును. దానివలన బుద్ధినాశము కలుగును. బుద్ధి నశించినచో సంసారకూపమున పతితుడగును'.

పై శ్లోకము, క్రోధమువలన మానవునిలో క్రమముగ కలుగు పరిణామములను, వాటి యొక్క అంతిమ ఫలమును చక్కగా వర్ణించి చెప్పినది. క్రోధము యొక్క అంతిమ ఫలము మానవుని యొక్క పతనము.

క్రోధము వలన సంభవించు దుష్ఫలితములను శ్రీవాల్మీకి మహర్షి రామాయణములో ఆంజనేయుని నోటి ద్వారా చెప్పించినాడు.

శ్రీ ఆంజనేయుడు సీతాన్వేషణలో లంకను చేరినాడు. అచట వనములను ధ్వంసము చేసినాడు అనేకమంది రాక్షసులను వధించినాడు. అనంతరము, తన ఇచ్ఛానుసారముగా లంకా వాసులకు లొంగిపోయినాడు. ఆంజనేయుని అవమాన పరచుటకు గాను, లంకావాసులు అతని వాలమునకు నూనెతో తడిపిన బట్టలను చుట్టి, అగ్నిని

ముట్టించినారు. అంతట, ఆంజనేయుడు అతి క్రుద్ధుడై, వారికి నీతిని నేర్పదలంచి, తాను ఒక గృహము మీది నుండి ఇంకొక గృహము మీదికి లంఘించును సకల గృహములకు నిప్పు నంటించి, సమస్త లంకను అగ్నికి ఆహుతి చేసినాడు. ఆఖరుగా తాను సముద్రములో దుమికి తన వాలమునకున్న అగ్నిని అంతమొందించినాడు.

అపుడు, అశోకవనములోని సీతామహాతల్లి అతని స్మృతిపథమున కొచ్చి ఈ అగ్నిప్రమాదములో ఆమె యొక్క పరిస్థితి ఎలా ఉన్నదోనని దుఃఖించి, తాను క్రోధోన్మత్తుడై చేసిన కార్యమునకు చింతించి, ఈ క్రింది విదముగా పశ్చాత్తాపపడతాడు.

**శ్లో॥ క్రుద్ధః పాపం న కుర్యాత్కః క్రుద్ధో హన్యాద్గురూ నపి।**
**క్రుద్ధః పరుషయా వాచా నరః సాధూనధిక్షిపేత్॥**
(వా.రామాయణం)

'క్రోధానికి లొంగిన వ్యక్తి చెయ్యలేని పాపం లేదు. దానికి లోబడ్డామో గురువులను హననం చేయగలం, పరుషవాక్కలతో కర్కశంగా చరించగలం, సాధువులను హింసించగలం. అందుచేతనే కామక్రోధాలకు లొంగని మహనీయులు ధన్యులు అని అనుకుంటాడు.

క్రోధము తనకు లొంగిన వ్యక్తిచేత ఎటువంటి చెడ్డపనినైనను చేయిస్తుంది. ఆఖరుకు హత్యనైనను చేయిస్తుంది. క్రోధమునకు లోబడ్డ వ్యక్తి వివేక విజ్ఞానములను కోల్పోయి, మతిభ్రమించి, ఉచితానుచిత విచారణ చేయక, ఎటువంటి నీచకార్యమునైనను చేయుటకు వెనుకాడడు. కావున, క్రోధము పాపములకాటపట్టు.

క్రోధము త్రివిధ నరకాద్వారములలో ఒకటియని శ్రీకృష్ణపరమాత్మ భగవద్గీతలో వివరించియున్నాడు :

**శ్లో॥ త్రివిధం నరకస్యేదం ద్వారం నాశన మాత్మనః।**
**కామఃక్రోధ స్తథా లోభః తస్మాదేత త్రయం త్యజేత్॥ (భగీ. 16-21)**

'కామ క్రోధ లోభములు మూడును నరకమునకు ద్వారములు. వాటివలన మనుష్యుడు సర్వనాశనము చెందగలడు. కాబట్టి, వాటిని పరిత్యజించవలెను'.

క్రోధము వలన గలుగు ఒడిదుడుకులను సహించి, సంయమచిత్తుడగు వాడే యోగి యనబడుననియు, అట్టివాడే సుఖపడగలడనియు కృష్ణపరమాత్మ భగవద్గీతలో బోధించియున్నాడు.

శ్లో॥ శక్నోతీహైవ యస్సోఢుం ప్రాక్శరీర విమోక్షణాత్।
కామక్రోధోద్భవం వేగం సంయుక్తః స సుఖీ నరః ॥
(భగీ. 5-23)

'బ్రతికి దేహముతో ఉండగానే కామక్రోధముల ఒడిదుడుకులను చల్లార్చిన వాడే యోగి, వాడే సుఖపడును'.

కాబట్టి, ప్రతి మానవుడు క్రోధము అదుపులో నుంచి, దుష్కార్యములకు దూరముగా నుండుగాక! యని సనాతనధర్మము బోధించుచున్నది.

...

ఇపుడు మనము వర్ణాశ్రమధర్మములను గురించి సనాతన ధర్మము ఏమి బోధించుచున్నదో వచ్చే సంచికలో విచారించెదము.

* భగవంతుని నీవు చూడలేకపోయినా ఆయన నిన్ను చూస్తూనే వున్నాడు. కనుక నీ నడవడి సక్రమంగా వుంచుకో.

* పరులను యాచించకు వారు ఇతరుల దృష్టిలో నిన్ను చులకన చేస్తారు. పరమాత్మను యాచించు ఆయన నీ కష్టాలను తీరుస్తాడు.

# భగవన్నామ స్మరణం
## (భక్తుని రక్షా కవచం)

... సురేఖ

సైనికుడు నిరంతరం అప్రమత్తుడై వున్నపుడే దేశానికి రక్షణ. శత్రువులు ఏవైపు నుండైనా, ఏ క్షణంలోనైనా, ఎటువంటి ఆయుధంతోనైనా దాడిచేసే పరిస్థితి వస్తే దాని నెదుర్కొనడానికి సుశిక్షితుడై, సాధన చేస్తూ ఏమరుపాటు లేకుండా కావలి కాస్తుంటాడు. అపుడే రాజ్యం /దేశం ఎటువంటి భయాందోళనలు లేకుండా వుంటుంది. శత్రుదేశాలు /శత్రుదళాలు కూడా దాడి చేయడానికి సంకోచిస్తాయి. తద్వారా శాంతి వర్ధిల్లుతుంది. ఒక విధంగా చెప్పాలంటే ప్రతి మనిషీ సైనికుడే. ఉద్యోగ ధర్మంగా సైనికుడుగా వుండడం ఒక మనిషి జీవనాధారం. కానీ ప్రతి మనిషి తన అంతర్గత శతృవులైన అరిషడ్వర్గాల దాడి నుండి అప్రమత్తంగా వుండడం జీవనధర్మం.

కామక్రోధ లోభ మోహ మద మాత్సర్యాలనే అంతః శత్రువులు ఎపుడు, ఎటువంటి సందర్భంలో దాడిచేస్తారనే విషయం ఎవరూ అంచనా వేయలేరు. అవి మనపై దాడి చేసి మనలను అతలాకుతలం చేసినా గానీ కొన్ని సందర్భాలలో గుర్తించడం సాధ్యం కాకపోవచ్చు. మహామహులే వీటి బారిన పడి వారి జీవిత లక్ష్యం నుండి దారి మరలి మరలా స్థిమితంగా వాటిని విచారించి తమ స్థితిని మెరుగు పరచుకున్న సందర్భాలెన్నో.

ఒక స్థాయికి చేరుకున్న మహనీయులనే ఇబ్బందికి గురిచేసి ఒక ఆట ఆడించే ఈ అరిషడ్వర్గ విషయంలో సామన్యుల పరిస్థితి ఏమిటి ? వారికి రక్షణ ఏమిటి అని ఆలోచిస్తే దొరికే సమాధానం "భగవంతుని పట్ల భక్తి అనే కవచము.

భక్తుడు అనే గుర్తింపు (భగవంతుని వద్ద)

భగవన్నామమనే ఆయుధం ఈ మూడు కలిగిన వారు ఎటువంటి శత్రువునైనా, ఎటువంటి సందర్భంలోనైనా జయించగలిగి చిరకాలం శాంతి సౌఖ్యాలతో విరాజిల్లుతారు. కాబట్టి ప్రతి వ్యక్తి భగవంతుని పట్ల భక్తిని పెంపొందించుకోవాలి.. తాను ఆ భగవంతుని సేవకుడిని / బంటును అని నిరంతరం స్ఫురణలో వుంచుకొని భగవన్నామాన్ని స్మరిస్తూ శాంతి సౌఖ్యాలను పొందాలి.

అంతఃశతృవులను జయించిన వారి జీవితం శాంతికి నిలయం. శాంతి ఎచ్చట వుంటుందో అక్కడ భగవంతుడు తన శక్తిని అందజేస్తాడు. అందుకే నిరంతరం భగవన్నామ స్మరణ జరిగే చోటకు వెళితే, ఆ భగవన్నామ సంకీర్తన చేసేవారిని కలిస్తే ఏదో తెలియని ఆనందం సామాన్యులకి, భగవంతుని ప్రేమ పొందాలనుకొనే ఆర్తులకు, వేదనలతో వేసారిపోతున్న అభాగ్యులకు కొంత స్వాంతన కలిగిన అనుభూతి కలుగుతుంటుంది. మరి మన మనసులో శాంతిని నెలకొలిపే "భగవన్నామస్మరణం' నిరంతరం జపిద్దాం. భక్తి రాజ్యంలో "భగవంతుని బంటు" అనే గుర్తింపు పొందుదాం. భగవద్రక్షణావలయంలో చేరి స్వాంతన పొందుదాం.

# యోగవాసిష్ఠ కథాలహరి

డా॥ ధారారామనాధశాస్త్రి, ఒంగోలు

## మహర్షిగా మారిన రాజర్షి

ఒకవైపు నిరంతర ధారగా శ్రీవసిష్ఠుల తాత్త్విక ప్రవచనం సాగుతున్నది. మరొకవైపు శ్రీరామునికి తత్త్వవిచార ఫలితమైన మనశ్శాంతి లభించకున్నది. ఆనాటి రాత్రి రాముడు మణిదీపకళిక సాక్షిగా మననంతోనే గడిపాడు. ఏమని ? అయ్యో! భోగజాలాన్ని త్యజించ లేకుండా ఉన్నానే! భోగాలను త్యజించిన తరువాతనే కదా కష్టాలు నశించేది. కష్టాలు తొలిగిపోతేనే కదా శాంతి లభించేది. అనుకొని ఆ ధ్యానాన్నే మనస్సులో గట్టి చేసుకొని తన బుద్ధిని తానే యిలా ప్రార్థించాడు. 'అమ్మా! బుద్ధీ! నీవు సాధ్వివి, పుత్రరూపిణివి. అందుచేత నీ పాదాలంటి ప్రార్థిస్తున్నాను. నా ప్రార్థనను అంగీకరించి సంసార బంధాలను ఛిన్నమొనర్చి భవ్యరూపమైన పూర్ణ పదప్రాప్తికి సంసిద్ధురాలవు కావసినది - ఈ ప్రార్థనా పూర్వక భావతరంగాలు ఒకదాని తరువాత ఒకటి పుట్టి పెరిగి గిట్టుతుండగా ఇంతలో ప్రాతఃకాలము ప్రాప్తించింది. రాముడు కాల్య కరణీయములను నిర్వర్తించుకొని సభాస్థలికి వెళ్లే సరికి సముచిత పరివార పరివేష్టితుడైన దశరథుడు ఉపవిష్టుడైయున్నాడు. రాముడు తండ్రికి భక్తి నెరపునంతలో దేవతలందరిచేత పరివేష్టితుడైన బ్రహ్మదేవుడు దేవేంద్ర సభలోనికి ప్రవేశిస్తున్నంత వైభవంతో శ్రీవసిష్ఠులు సభకి విచ్చేశారు. సభలో వారంతా భక్తివినమ్రులై ప్రత్యుత్థాన ప్రమాణాదికం నెరపగా మహర్షి ఆసీనులైనారు.

రాముడు మృదుమధుర కంఠధ్వనితో మెల్లగా అంటున్నాడు. 'గురుదేవా! మీ దయవల్ల శ్రవణమూ మననమూ సిద్ధించగా నేను తెలుసుకొన్నదేమంటే! సంసార రూపమైన మనస్సు వల్లనే జరామరనల బాధలు కలుగుచున్నవి. మనోరూప సంసారాన్ని లేక సంసారరూప మనస్సుని దాటడానికి ఉపాయమేదైనా ఉంటే సెలవివ్వండి.'

విన్న గురుదేవులు 'రామా! చక్కని ప్రశ్న వేశావయ్యా. సమస్త సాధనలకీ ప్రాప్తించే ఫలితాలకీ అనుసంధానమైన ఆలోచన చేశావు. అవధరించు. మొదటిమెట్టు మనస్సును మనలోనుండి తీసి దూరంగా పారెయ్యలేము కదా ? పైగా నిరంతర మనోవ్యాపారం సాగనిదే మన బ్రతుకులు సాగవు కదా! అంచేత ముందు మనస్సును శుద్ధి చేయాలి. ఎలాగ ? మంచి శాస్త్రాలను పఠించడంవల్ల, మంచి మిత్రుల సంగతివల్ల క్రమదశా సాధ్యమైన వైరాగ్యభావం చేత మనస్సును పుణ్యవంతము , శుద్ధముగా చేసుకోవాలి. నశించిపోయే ఈ శరీరము అనే ఉపాధితో మిశ్రితమైయున్న ఆత్మను పంచకోశ వివేకము చేత వేరుచేసి స్వస్థతను పొందాలి. ఆపైన శోకముగాని, మోహముగాని, జన్మగాని, మరణముగాని దేనికిలేవో ఆ ఆత్మకలదు. అని తెలుసుకొని దుఃఖరహితుడవు కావాలి - ఇలాంటి క్రమసాధన ఆత్మ సాక్షాత్కారానికి ఉపకరిస్తుంది.'

రాముడు అంతా విని ఆకళింపు చేసుకొని సాలోచనగా ప్రశ్నించాడు. మహాత్మా! మీరు చెప్పింది సిద్ధాంతరీత్యా ఆమోదయోగ్యమే కాని అలా సాధన

చేసిన జ్ఞానమూర్తులెవరైన ఉన్నారా ! ఉంటే వారి కథ చెప్పండి.

శ్రీవశిష్టులు చెబుతున్నారు. లేకేమి రామచంద్రా విదేహాధీశులు జనకులున్నారు. గొప్ప రాజర్షి. ఆయన జీవితంలో ఒక అందమైన ఆధ్యాత్మిక భావ నిష్యందమైన చిన్న సన్నివేశం ప్రాప్తించి ఆకాశం నుండి చేతిలోనికి పడిన పండులాగ జ్ఞానసిద్ధి లభించింది. రాజర్షి మహర్షి అయ్యాడు. ఎలాగంటే...

మహా సంపదలతో తులతూగేవాడు, ఉదార బుద్ధి, మహా పరాక్రమ శీలుడు అయిన జనకుడు ఒక వసంతఋతువులో రమణీయమైన వనాంతర స్థలికి క్రీడార్థం వెళ్లాడు. కతిపయ విహారముల అనంతరం ఒక పుష్పవాటికి దగ్గర విశ్రాంతి తీసుకుంటుండగా ఇతనిలాగే విహారాగతులై సిద్ధబృందం వారిలో వారు ఆత్మ విద్యా ప్రమాణ భూతములు, అత్యంత మనోహరములు అయిన తత్త్వగీతాలను ఆలపిస్తున్నారు. చెవియొగ్గి విన్న జనకునికి తద్గతమైన అర్థం ఇలా భాసించింది.

ద్రష్టయైన జీవుడు దృశ్యరూప జగత్తులోని ఇష్టదృశ్యాలను చూచి ఎలాంటి ఆనందం పొందుతాడో అలాంటి నిశ్చలానంద రూపమై ఆత్మను మేము ఉపాసిస్తున్నాము. మనోవృత్తి యొక్క ఉత్పత్తికి సాక్షీభూతమైన ఆత్మను మేము ఉపాసిస్తున్నాము. ఉన్నది, లేదు అన్న రెండు స్థితులకూ అతీతమైన స్వయం ప్రకాశమైన ఆత్మను మేము ఉపాసిస్తున్నాము. సత్యవస్తువు 'సోహం' అనే అజపగాయత్రి ద్వారా పొందదగినది అయిన ప్రత్యగాత్మ మా ఉపాస్యము - అది హృదయ గుహలోనే ఉన్నది కదా? అందుచేత ఇతర దేవతాశ్రయం మాకు అక్కరలేదు.

సిద్ధగీత విన్న జనకుడు అప్పటికపడు విహారయాత్ర ముగించి సముద్రంలో లీనం కావడానికి ఎగిరిపడే నదీ ప్రవాహంలాగా రాజధాని చేరుకు అన్నాడు. అటుపైన అంతా ఆత్మ విచారమే. అనన్య సాధనే. ఎలాగంటే..

అయ్యో! అనంత కాలంలో నా జీవితం ఎంత అల్పమో తెలియక మోసపోయానే ! బొమ్మలో చందమామను నిజమైన చంద్రునిగ భావించినట్లు అనాత్మను చూస్తూ ఆత్మకు దూరమయ్యానే! సమస్త సుఖభోగాలు నీటి బుడగల్లాంటివి.

**అజ్ఞానైకహతో బాల్యే యౌవనే మదనాహతః ।**
**శేషే కలత్ర చింతార్తః కింకరతోతిసదాజడః॥**

(జడుడైన మానవుడు బాల్యంలో అజ్ఞానం చేత యవ్వనంలో మన్మధునిచేత, వార్ధక్యంలో కుటుంబ చింతలచేత పీడింప బడుతున్నాడు. - ఇంక ఉద్ధరింపబడేదెప్పుడు ?)

**ప్రభుద్ధోస్మి ప్రహృష్టోస్మి । దృష్టశ్చోరో యమాత్మనః ॥**
**మనోనామ నిహన్యేనం । మనసా స్మిచిరంహతః ॥**

(నేనిప్పుడు ప్రబుద్ధుడను, ప్రసన్నుడను, ఆత్మను దొంగిలించిన దొంగను పట్టాను. అతడే మనస్సు. వానిని చంపేస్తాను. ఎందుకంటే చిరకాలం నేను వాడిచేత దెబ్బలు తిన్నాను.)

రామా! ఇప్పుడు జనకునికి ఇష్టానిష్టాలులేవు, భూతకాలపు చింతలు లేవు. భవిష్యత్తులలో ఆశలులేవు, వర్తమానంలో హాయిగా సంతోషంగా జీవిస్తున్నాడు.

కనుక రఘువరా ! నీవున్నూ అలాగే సాధకుడవై, యోగివై, జ్ఞానివై భాసించు. నీ చరిత్ర జగత్తుకు ఆదర్శమవుతుంది. అంటూ ముగించారు వశిష్ఠులు.

గీతా సుధ

# భగవద్గీతకు భాసుర భాష్యం



డా॥ రాధశ్రీ, కర్నూలు, ఫోన్: 9494481210

(గత సంచిక తరువాయి)

ఆ విశ్వరూపంలో అర్జునుడు అనేక వక్త్రాలను, అనేక నేత్రాలను, అనేక అద్భుతాలను, అనేక దివ్యాభరణాలతో పైకి ఎత్తబడిన అనేక ఆయుధాలను చూచాడు.

శ్లో॥ అనేకవక్త్ర నయనమ్ అనేకాద్భు తదర్శనమ్।
అనేకదివ్యాభరణం దివ్యానేకోద్యతాయుధమ్ (11-10)

దివ్యమైన మాలలు, వస్త్రాలు ధరించి, దివ్య గంధాలతో పూయబడిన అన్ని అద్భుతాల మయంగా ఉన్న సర్వవ్యాపిని పరిమితిలేని ప్రకాశాన్ని అర్జునుడు చూచాడు.

శ్లో॥ దివ్యమాల్యాంబరధరం దివ్యగంధానులేపనమ్।
సర్వాశ్చర్యమయం దేవమ్ అనంతం విశ్వతోముఖమ్ (11-11)

వేల కొలది సూర్యుళ్లు ఒకసారి ఉదయిస్తే ఎంత కాంతివంతంగా ఉంటుందో విశ్వరూపియైన ఆ పరమాత్ముని తేజం అంతగా ఉన్నది.

శ్లో॥ దివి సూర్యసహస్రస్య భవేద్యుగపదుత్థితా।
యది భాః సదృశీ సా స్యాత్, భాసస్తస్య మహాత్మనః॥ (11-12)

ఒక్కచోటే అర్జునుడు అన్నీ చూచాడు.

శ్లో॥ తత్రైకస్థం జగత్కృత్స్నం ప్రవిభక్తమనేకధా।
అపశ్యద్దేవదేవస్య శరీరే పాండవస్తదా ॥ (11-13)

భౌతిక దృష్టికి అందని దానిని జ్ఞాన దృష్టితో చూడడం అన్నది ఈ నాటికీ సర్వసాధారణమే. మనం కూర్చున్న ప్రదేశం నుండి కేవలం ఐదు లేక ఆరు కిలో మీటర్ల పరిధి మాత్రమే భౌతికంగా చూడగలం. ఇక ఆ తర్వాత ఏమీ లేదనుకోవడం అవివేకం. ఆ తరువాత ఉన్నదాన్ని కూడా జ్ఞానంతో చూడగలం.

భౌతికంగా మనం ఉన్నచోటు నుండి కొద్ది రూపం మాత్రమే చూడగలం. ఉదాహరణకు మనం ఒంగోలులో ఉన్నామనుకోండి. ఒంగోలు నుండి మనకు భౌతికంగా శ్రీకాకుళం, విజయనగరం, గుంటూరు, ఏలూరు, అమెరికాలోని శాన్ ఫ్రాన్సిస్కో, చికాగో, రష్యాలోని తైనాన్మన్ స్క్వేర్ వంటివి కనపడతాయా ? అలాగని మనం "నా కంటికి కనబడడంలేదు కాబట్టి లేవు" అనగలమా ? అలాగే కనబడుతున్న సూర్యుడు, చంద్రుడు "కనబడుతున్నారు కాబట్టి దగ్గరే ఉన్నారు " అని అనగలమా ? ఒంగోలు సెంటరులో గ్రాండు ట్రంకురోడ్డులో వున్న మనిషికి ప్రక్కనే ఉన్న "పేర్నమిట్ట" కనబడదు కానీ ఎక్కడో ఉన్న చంద్రుడు కనబడతాడు కాబట్టి "పేర్నమిట్ట కన్నా చంద్రుడే దగ్గర ఉన్నాడు" అనగలడా ? భౌతిక దృష్టికి మించి చూడాలంటే జ్ఞాన దృష్టి కావాలి. యోగదృష్టికావాలి. కర్మదృష్టి కావాలి. ఈ వేళ దారపు పోగులుగా కనిపించేవే రేపు బట్టలుగా మారి షాపుల్లోకి వెళ్లి, దర్జీల చేతులలోకి వెళ్లి చివరకు మనుషులు వేసుకునే అంగీలుగా, లుంగీలుగా, ధోవతులుగా చీరలుగా మారి కాల క్రమంలో చివికి, జీర్ణమై బండతుడవడానికి వాడబడతాయి. గేదె నుండి నెయ్యి రాదు. గేదె ఇచ్చే పాలను మరిగించి చల్లార్చి తోడుపెట్టి మీగడ యిన తరువాత మీగడను తీసి చిలికి, చిలకగా వచ్చిన వెన్నను మరలా కరిగించినప్పుడు "నేయి" వస్తుంది. ఇంత కార్యక్రమం జరగాల్సిందే. అలాగే

"కర్మ" (పని)కి రూపంగా కనిపించే కృష్ణుడు ఈ వివరణల తర్వాత కాలపురుషుడు .......... గా అర్జునునకు కనిపిస్తున్నాడు. హెలికాప్టర్‌లో నుండి చూచినపుడు మామూలుగా చూచే నేల వైశాల్యం కన్నా, ఎక్కువ వైశాల్యాన్ని చూచినట్లు కాలానికి ప్రతీకగా నిలిచిన కృష్ణుడిలో (కాలంలో) భూత భవిష్యద్వర్తమానాలు అర్జునుడికి గోచరమయ్యాయి. ఇది చాలా చాలా సహజం. "అరె ఏమో అనుకున్నాను గానీ నీవు చాలా తెలివిగల వాడివిరా" అంటూ చిన్న విజయాలకు మనం అవతలవాడిని మెచ్చుకుంటాం. అంతకు ముందు కూడా అదేమనిషి కాకపోతే ఒక గొప్ప మాటతోనో, కర్మ (పని)తోనో అతనిలో దాగి ఉన్న శక్తి మనకు గోచరమయింది కాబట్టి మనం అలా అంటున్నాం. ఇదే సిద్ధాంతాన్ని కృష్ణార్జునులకు ఆపాదిద్దాం. అంతకు ముందున్న కృష్ణుడే కాని అవసరమైన సమయంలో కేవలం బావగా గాక, రథసారథిగా కాక, సలహాదారుడుగా, ఆలోచనాపరుడుగా, బోధకుడుగా, హితుడిగా, స్నేహితుడిగా కృష్ణుడు ఎదిగిపోయాడు. "అరె! మన కళ్లముందే ఆడవాళ్ల బట్టలు ఎత్తుకపోయిన బావ, వెన్న దొంగతనం చేసి వాళ్లమ్మచేత తన్నులు తిన్న బావ, ఊరంతా కొంటె పనులు చేసి జగడాలన్నీ ఇంటిమీదికి తెచ్చిన బావ, రోజూ నాతో, భీముడితో పరాచకాలాడే బావ... ఎంత పరిణతి చెందిన మనస్సుతో ఆలోచిస్తున్నాడు... ఎంత కార్యకారణ సంభందంతో చెబుతున్నాడు. ఎంత వైజ్ఞానికంగా మాట్లాడుతున్నాడు... ఎంత గొప్పగా కాలానికి వివరణ యిచ్చి, తానే కర్తగా, కర్మగా, కాలంగా నిలబడ్డాడు"... అనుకుంటూ సంభ్రమాశ్చర్యాలకులోనైనాడు అర్జునుడు. ఇది కూడా చాలా సహజంగా, హేతుబద్ధంగా గీతాచార్యుడు అక్షరబద్ధం చేశాడు. మనకన్నా చిన్నవాళ్ళు - మన కొడుకులో, కూతుర్లో... ఇంకా మనుమళ్లో, మనుమరాళ్లో... మనకు చాలా మేలు కలిగించే సులువైన పద్ధతులు గురించి మనకు వివరించారనుకోండి. ఎంతో ఆనందంగా ఉంటుంది. కంప్యూటరు గురించి అవగాహన లేని'తాత' కంప్యూటరు దగ్గర కూర్చొని ఒక్కొక్క డాక్యుమెంటుకు 'డిలీటు" చేసుకుంటుంటే వాళ్ల మనుమరాలు వచ్చి"ఒక్కొక్కటి 'డిలీటు' చేయడం ఎందుకు తాతా టైం వేస్టవుతుంది. నీవు ఏమేమి డాక్యుమెంట్లు 'డిలీటు' చేయాలో వాటి నన్నింటిని ఒక్కసారి 'సెలక్టు' చేసి, ఒక్కసారే 'డిలీటు' చేయవచ్చుకదా" అని వివరిస్తే, చేసి చూపిస్తే తాత దృష్టిలో మనుమరాలు అఖండ మేధావిగా పరిగణన పొందుతుంది. "అంతకు ముందు తాను ఎత్తుకొని, లాలించి పెంచిన మనుమరాలేనా ఈ అమ్మాయి" అనిపిస్తుంది.. ఇదుగో ఇక్కడ కూడా అర్జునుడు అలాంటి అనుభూతి పొందుతున్నాడు. ఆశ్చర్యపడ్డాడు. ఆనందపడ్డాడు. పులకాంకితుడైనాడు. తలవంచి రెండు చేతులు జోడించి మాట్లాడడం ప్రారంభించాడు.

శ్లో॥ తతః స విస్మయావిష్టో హృష్టరోమా ధనంజయః ।
ప్రణమ్య శిరసా దేవం కృతాంజలిరభాషత ॥ (11-14)

ఓ ప్రభూ నీవు కాలపురుషుడవు. కాలానికి
ప్రతీకగా నిన్ను చూడగలుగుతున్నాను. నీలో
అందరు దేవతలు వివిధ జీవులున్నారు.
పద్మాసనుడైన బ్రహ్మ, శివుడు, మహర్షులు,
స్వర్గలోకాన్ని, జ్ఞాన చిహ్నాలైన అహిసమూహాన్ని
చూడగలుగుతున్నాను నీ శరీరంలో

శ్లో॥ పశ్యామి దేవాంస్తవ దేవ దేహే సర్వాంస్తథా భూతవిశేషసంఘాన్।
బ్రహ్మాణమీశం కమలాసనస్థమ్ ఋషీంశ్చ సర్వానురగాంశ్చ దివ్యాన్ ॥
(11-15)

నీలో (కాలంలో) సర్వత్రా వ్యాపించి ఉన్న చేతులను, పొట్టలను, ముఖాలను, కళ్లను, నీలో (కాలంలో) నీకు ఆది, మధ్య, అంతం కనబడడంలేదు. ఓ విశ్వేశ్వరా, విశ్వరూపా నీ రూపం ఆది మాధ్యాంతరహితం.

శ్లో॥ అనేకబాహూదరవక్త్రనేత్రం పశ్యామి త్వాం సర్వతోనంతరూపమ్।
నాంతం న మధ్యం న పునస్తవాదిం పశ్యామి విశ్వేశ్వర విశ్వరూప॥
(11-16)

ఇంత తేజోరాశివైన నిన్ను నేను చూడలేకపోతున్నాను. మండుతున్న అగ్నివంటి, ప్రజ్వలిస్తున్న సూర్యుని వంటి కాంతిగల నిన్ను ఎంతో కష్టంతో చూడగలుగుతున్నాను. అనేక కిరీటాలతో, గదలతో చక్రాలతో భాసిస్తున్న నిన్ను నేను చూడగలుగుతున్నాను.

శ్లో॥ కిరీటినం గదినం చక్రిణం చ తేజోరాశిం సర్వతో దీప్తిమంతమ్।
పశ్యామి త్వాం దుర్నిరీక్ష్యం సమంతాత్ దీప్తానలార్కద్యుతిమప్రమేయమ్ (11-17)

నీవు పరిమాణరహితుడిగా నాకు గోచరిస్తున్నావు. ఆది అంతాలు లేని ఓ "కాల" పురుషా ఓ "కర్మ" రూపా ఇప్పుడు నాకు పూర్తిగా అవగతం అవుతున్నది కాలం, కర్మం అనే రెండు విషయాలకు రూపందాల్చిన వాడివిగా ఉన్నావు. నీవు అనశ్వరుడవు (నాశనం లేనివాడివి) నీవే ఈ విశ్వానికి ఆధారం. నీవే అక్షయుడవు. నీవే సత్యాధర్మ సంరక్షకుడవు. నీవే పరమ పురుషుడవు. ఇదియే నా నిశ్చితాభిప్రాయము.

శ్లో॥ త్వమక్షరం పరమం వేదితవ్యం త్వమస్య విశ్వస్య పరం నిధానమ్।
త్వమవ్యయః శాశ్వతధర్మగోప్తా సనాతనస్త్వం పురుషో మతో మే॥
(11-18)

ఆది మధ్యాంత రహితునిగా, అపరిమితమైన వైభవంతో, అనేక భాహువులతో, శశిసూర్య నేత్రాలతో, మండుతున్న అగ్నిముఖునిగా ఈ విశ్వాన్ని తపింపజేయు వాడిగా నిన్ను నేను చూడగలుగుతున్నాను.

శ్లో॥ అనాదిమధ్యాంతమనంతవీర్యమ్ అనంతబాహుం శశిసూర్యనేత్రమ్।
పశ్యామి త్వాం దీప్తహుతాశవక్త్రం స్వతేజసా విశ్వమిదం తపంతమ్॥
(11-19)

నీవు ఒక్కడివే అయినా అంతరిక్షానికీ భూమికీ మధ్యవున్న ప్రదేశాన్ని ఆక్రమించి ఉన్నావు. నీ అద్భుతమైన, మహోగ్రమైన రూపాన్ని మూడు లోకాల వారూ చూచి కలితపడుతున్నారు.

శ్లో॥ ద్యావాపృథివ్యోరిదమంతరం హి వ్యాప్తం త్వయైకేన దిశశ్చ సర్వాః।
దృష్ట్వాద్భుతం రూపముగ్రం తవేదం లోకత్రయం ప్రవ్యథితం మహాత్మన్॥
(11-20)

ఇక్కడ అర్జునుడి మనస్తత్వం మానవుణి మనస్తత్వంలాగా ఉండి చాలా స్వాభావికంగా ఉంది. సర్వసాధారణంగా మనం ఆనందంగా ఉంటే అందరూ మనలాగే ఆనందంగా ఉన్నారనుకుంటాం. మనం విషాదంతో ఉంటే ప్రపంచమంతా విషాదముగా కనిపిస్తుంది. నిజానికి "నీ ఒక్కడివే చూడు" అంటూ కృష్ణుడు అర్జునునికి జ్ఞానాన్ని ప్రసాధించాడు. కాని అర్జునుడు కృష్ణుడి తేజోమయ రూపాన్ని చూడలేక తల్లడిల్లిపోతూ మూడు లోకాల వాళ్లూ నీ ఉగ్రరూపాన్ని భరించలేకపోతున్నారు అంటున్నాడు. నిజానికి కృష్ణుడు ముల్లోకాలవాళ్లకూ తన విశ్వరూపాన్ని చూపించలేదు కదా మరి మూడు లోకాల వాళ్లూ భయడుతున్నారని అర్జునుడు అంటున్నాడేమిటి ?... అంటే అది మానవ సహజం. అందుకే సుమతీ శతకం వ్రాసిన బద్దెన

**కం॥ తన కలిమి ఇంద్రభోగము**
**తనలేమియె సర్వలోక దారిద్ర్యంబున్**
**తన చావు జగత్ప్రళయము**
**అనువలచిన అతివరంభ! తథ్యము సుమతీ!!..**

అన్నాడు... అంటే తాను భయపడుతున్నాడు గాబట్టి అందరూ బయపడుతున్నట్లు అనుకుంటున్నాడు. దృగ్గోచరంకాని "కాలాని"కి రూపం వస్తే ఎలా ఉంటుందో అర్జునుడు ఊహించుకొని ఆ కాల పురుషుణ్ణి కృష్ణుడిలో చూచాడు. తనకు కనిపించిన వీరందరూ శరణాగతులై కాలంలో (కాల పురుషుడిలో)కి వెళ్ళిపోతున్నారు. మహార్షులు, సిద్ధులు, యోగులూ శాంతి మంత్రాలు వల్లించుకుంటున్నారు.

శ్లో॥ అమీ హి త్వాం సురసంఘా విశంతి కేచిద్భీతాః ప్రాఞ్జలయో గృణంతి।
స్వస్తీత్యుక్త్వా మహర్షిసిద్ధసంఘాః స్తువన్తి త్వాం స్తుతిభిః పుష్కలాభిః॥
(11-21)

రుద్రులు, ఆదిత్యాలు, వసువులు, సాధ్యులు, దేవతలు, అశ్వినాలు, మరుత్తులు, గంధర్వులు, యక్షులు, రాక్షసులు, సిద్దులు, చనిపోయిన పితృపరంపర అందరూ నరునికి కనిపిస్తున్నారు. తాను ఆశ్చర్యంతో చూస్తున్నారు కాబట్టి వాళ్ళు కూడా ఆశ్చర్య చకితులై కృష్ణుణ్ణి చూస్తున్నట్లు అర్జునుడు భావిస్తున్నాడు.

శ్లో॥ రుద్రాదిత్యా వసవో యే చ సాధ్యా విశ్వే శ్వినౌ మరుతశ్చోష్మపాశ్చ।
గంధర్వయక్షాసురసిద్ధసంఘా వీక్షంతే త్వాం విస్మితాశ్చైవ సర్వే॥(11-22)

మనం కూడా ఒకసారి కాలాన్ని అవలోకించినట్లైతే, ఒకసారి కాలాన్ని కళ్ల ముందుకు తెచ్చుకున్నట్లైతే ఆదిమానవులు, జంతుజాలం, ఏకకణజీవులు, ఉభయచరాలు, పెగ్మీలు, నీగ్రోలు, అమెరికన్లు, రష్యన్లు, జపనీయులు, గాంధీగారు, సోక్రటీసు, ఆర్కిమెడిసు, అలెగ్జాగరసు, థేలీస్, అబ్రహాం లింకన్, జాన్ కెనెడీ, లెనిన్, స్టాలిన్, కృశ్చేల్, కొసిగిన్, ఆండ్రపోవు, సుఖారోవు, గార్బోచేవు మార్టిన్ లూథర్ కింగు, నెల్సన్ మండేలా...... ఇలా... ఇలా... ఎందరో మన మనో ఫలకాలమీద గోచరమవుతారు. ఇందులో ఉన్న కిటుకు ఏమిటంటే అంతగా "కళ్లకు కట్టినట్లు" చెప్పగలిగే వాళ్లు ఉండాలి. పులుపుల శివయ్యగారు పల్నాటి గీతం వ్రాస్తూ....

"…. బాలచంద్రుని కదన
కౌశలము కథలల్లి
శ్రీనాద కవిరాజు
చంద్రవంకకు చెప్ప
ఎదకరగి ప్రవహించెరా... పలనాడు
ఎత్తిపోతలదూకెరా...
........... అన్నప్పుడు.....

"…. మగువ నాగమ్మతో
మాయ యుద్ధము వచ్చె
మగువ మాంచాల ... తా
మగని రణమున కంపె
వీరవనితలు బుట్టిరీ... పలనాట
శౌర్య ముగ్గులు పెట్టిరీ......

ఒక్క సుముహూర్తాన ఉప్పొంగి భరతోర్వ
స్వాతంత్ర్య సమరంపు సింహనాదము చేయ
మేరువైనిలచిందిరా ..... పలనాడు
ముందుండి పోరిందిరా

కనెగంటి హనుమంతు - కోరమీసము త్రిప్పి
పన్నులెగబెట్టించె - పలనాటి ప్రజలచే
బలియిచ్చె హనుమంతునూ ........ పలనాడు
పరప్రభుత్వపు గుండ్లకు ......... అంటూ

కళ్లకు కట్టినట్లు "పిక్టోరియల్ ఎఫెక్ట్" తోవర్ణించాడు. ఆ పాట చదివినా, విన్నా మనసు ఉప్పొంగి, వెంట్రుకలు నిక్కబొడుచుకొని శరీరమంతా పులకించి పోతుంది. బాలచంద్రుడు, బ్రహ్మనాయుడు, మాంచాల, నాగమ్మ,హనుమంతు మనకళ్ల ముందు ఉన్నట్లే ఉంటుంది. అదీ బోధకుడికి, ఆచార్యుడికి, కవికి ఉండవలసిన ఉన్న తోన్నత గుణం. ఆ గుణం లేక పోతే, కళ్లకు కట్టినట్లుగా చెప్పలేకపోతే చప్పగా ఉంటుంది. మరి గీతా బోధకుడైన శ్రీకృష్ణుడు కళ్లకు కట్టినట్లు చెప్పబట్టే అర్జునుడు 'కాలాన్ని" (రూపంలేని కాలాన్ని) చూడగలిగాడు. కాల గర్భంలో కలిసిపోతున్న వారిని కూడా చూడగలిగాడు... అంతే కాదు ఒక్కసారిగా మహా కాలరూపాన్ని చూచినందున కలత పడుతున్నాడు. తను కలత చెందుతున్నాడు కాబట్టి లోకమంతా కలత పడుతున్నదని కృష్ణుడికి చెబుతున్నాడు. 'ఓ గొప్ప భుజములు కలవాడా! ఎన్నో చేతులు, ఎన్నో తొడలు, ఎన్నో పాదములు, ఎన్నో పొట్టలు, ఎన్నో దంతాలు, ఎన్నో ముఖాలు, ఎన్నో కళ్లు కలిగి భయం కలిగించే విధంగా ఉన్నావు. నిన్ను జూచి లోకాలు భీతిల్లుతున్నాయి" అన్నాడు. (సశేషం)

# చల్లగాసాగే సెలయేరు

... సుజాత

యజమాని తన యింటి పనివాడిని ఆదరణతో చూస్తే ఆ పనివాడు యజమాని పట్ల గౌరవభావంతో ఇంటి పనిని చక్కగా చేసుకుంటూ ఉంటాడు. యజమాని మనస్సు తెలుసుకొని పనివాడు ప్రవర్తించాలి. అతని అడుగు జాడలలో నడవాలి. అప్పుడే యజమాని పనివాడిని ప్రేమగా, ఏ కష్టమూ రాకుండా చూచుకుంటాడు. ఆపద సమయంలో ఆదుకుంటాడు. ఇలా వీరిద్దరూ ఎవరెవరి బాధ్యతలు వారు సక్రమంగా నిర్వర్తించినప్పుడే ఇద్దరి మధ్య సరియైన అవగాహన ఏర్పడుతుంది. అవగాహనలో ఏ మాత్రం తేడా జరిగినా ఆ బంధం ఎక్కువకాలం కొనసాగదు. ఒకవేళ కొనసాగినా సక్రమంగా ఉండదు.

అలాగే ఈ దేహమనే గృహానికి మనస్సు యజమాని అయితే ఆ మనిషిని పనివానితో పోల్చాలి. ఎందుచేతనంటే మనస్సు ఎల్లప్పుడూ ఉన్నత స్థానంలోనే ఉండాలని కోరుకుంటుంది. తన ప్రవర్తన ఇతరులకు ఆమోదయోగ్యమైనది అయినా కాకపోయినా తాను మాత్రం ఎవరికీ లొంగి ఉండాలని కోరుకోదు. ఇది మనస్సు సహజసిద్ధ లక్షణమేమో! అలా అని మనస్సును పట్టించుకోకపోతే ఆ మనిషి జీవనయానం అపసవ్యాల బాటలో పయనించదా!

అందుకే మనస్సు యొక్క చర్యలు, ఆలోచనలు, సంకల్పాలను మొదట గమనించాలి. అవి సక్రమమైన మార్గంలో ఉన్నాయా లేదా వక్రగతిలో నడుస్తున్నాయా అని పరిశీలించాలి. మనిషి యొక్క విచక్షణాబుద్ధికి పని కల్పించవలసింది ఇటువంటి స్థితిలోనే. అవి వక్రమార్గంలో నడుస్తున్నాయని అనిపించినప్పుడు మనస్సుతో ''నీవు తప్పుచేస్తున్నావు, నీ యిష్టం వచ్చినట్లుగా నడుస్తున్నావు, నీ పద్ధతి మార్చుకోకపోతే ఊరుకోను'' ఇలాంటి మాటలు మాట్లాడితే అదీ ఎదురు తిరుగుతుంది. లేకపోతే సమర్థించుకోవడానికి ప్రయత్నిస్తుంది. అంతేగాక తన దుశ్చేష్టలను ఎక్కువ చేయడానికి కూడా వెనుకాడదు.

అందుకే మనస్సుతో ఎదురీది మార్చాలనుకోవడం, పోరాడి గెలవాలనుకోవడం అవివేకమే అయితే దానిని అనునయంతో మార్చడానికి చేసే ప్రయత్నమే వివేకమవుతుంది. యజమానికి ఎదురు తిరిగి పనివాడు నిలువగలడా! అలా ఎదురు తిరిగితే అతనిని పనిలో నుండి ఏ క్షణంలోనైనా తీసివేసే అధికారం యజమానికి ఉంటుంది. అప్పుడు యజమాని మనసెరిగి ప్రవర్తించనందుకు పనివాడు నష్టపోతే ఒక మంచి పనివాడిని పోగొట్టుకొన్నందుకు యజమాని వ్యతచెందుతాడు.

మనస్సు కూడా అంతే. తనపై అధికారం చెలాయించిన వాళ్లను క్షోభపెడుతుంది. జీవితాన్ని ఛిద్రం చేస్తుంది. అంటే తనను తానే మోసం చేసుకుంటుంది. తనకు ఆధారభూతమైన దేహము వెతలపాలైతే తనకు కూడా నష్టం కదా మరి!

మనస్సు జ్యోతిస్వరూపము. అయితే అది వెలగడానికి ఆధారభూతమైన ప్రమిదయే ఈ దేహము. ప్రమిదలో పోసే తైలమే మనిషికి ఉండవలసిన విచక్షణాబుద్ధి. తైలమున్నంత వరకూ జ్యోతి వెలిగినట్లే విచక్షణాబుద్ధి పనిచేసినంత కాలం మనిషి మనుగడకు అవరోధం ఉండదు కదా!

అటువంటి జీవితం చల్లగా సాగే సెలయేరు అవుతుందనటంలో అతిశయోక్తి ఏముంది!

# సంకల్ప సిద్ధి

బ్రహ్మశ్రీ
బొడ్డుపల్లి పవన్‌కుమార్ అవధాని,
గుంటూరు.

''సంకల్పము'' అనే అంశము మనస్సునకు చెందినది. సంకల్పమంటే ఎన్నిక. మనోనిశ్చయం, గట్టిగా నెంచుకొనుట, తలంపు అనే అర్థాలున్నాయి. అన్ని కోర్కెలకూ, అన్ని కారణాలకు మనసే ప్రధానము. ఏదైనా విషయం మనసులోకిరాగానే సరిపోదు, దానిలో నిజం ఎంత వరకు వుంది ? అబద్ధం ఎంతవరకు వున్నదో రూఢీ చేసుకోవడంలో సంకల్పం తోడ్పడుతుంది. సంకల్పమువుంటేనే ఏ కార్యసాధనకైనా పునాది పడుతుంది. ఇది పురాణకాలానికీ, నేటి కాలసర్వకాల సర్వావస్థలలో తోడ్పడుతుంది. విద్యార్థులు తమ ఉన్నత సోపానాలు అధిరోహించుటకు శాస్త్రవేత్తలు నూతన ఆవిష్కరణలు చేయుటకు, గురువులు సమాజహితాన్ని, కవులు నూతన కథా వస్తువులను తయారు చేయాలన్నా, కళాకారులు తమ రంగంలో విశేష ప్రతిభను కనబరచాలన్నా మనోధైర్యం, దృఢ సంకల్పం అవసరం.

పురాణాలలో నారద మునీంద్రుడు సంకల్ప సిద్ధుడు సర్వజ్ఞాన స్వరూపుడు. బ్రహ్మమానసపుత్రుడు. వివిధ శాస్త్రప్రవీణుడు, కళాధురీణుడు, నైపుణ్యవరేణ్యుడు. బహు పురాణాలలో సంభాషణా చతురసమున్నతుడుగా, రాక్షసమూకల, దేవతావరుల అంతరంగిక విషయాలలో బహులాషువంగా, అతినులువుగా ప్రవేశించి, సంకల్పబలంతో మొక్కలోని సమభావ స్వరముతో లోకకళ్యాణం చేసేవాడు. అయితే దేవమునీంద్రుడు నారదమహర్షికి కలహభోజనుడనీ నిరంతర త్రిలోక సంచారియనీ ఆకాశవీధిలో సదాహరినామ సంకీర్తనా పరుడనీ, మహతి అనే వీణను మీటుతూ ఏడేడులోకాలు తిరుగాడుతూ వార్తాహరుడని, సంస్కారవంతుడని, భగవంతుని పట్ల భక్తి అనురాగం కలవాడని, జగన్నాధుడు శ్రీమన్నారాయణుడికి ప్రియాతి ప్రియమైన భక్తపుంగవుడని ప్రతీతి. బాపురె! ఆయన లేని పురాణాలుగానీ, ఆయన ప్రమేయంలేని లోకకార్యాలుండవంటే అతిశయోక్తికాదు.

మనస్సులోని సంకల్పాలు పూర్వజన్మల కర్మఫలాల నుండి మంచీ, చెడులను కలిగిస్తాయి. ఎంతటి మహనీయులైనా రజ స్తమోగుణాల ప్రలోభంలో పడినప్పుడు శ్రమదమాలకు ప్రత్యామ్నాయంగా ప్రవర్తిల్లినప్పుడు అతడు ఆపదాశృంఖలాది బద్ధుడై సంస్కారహీనుడై కష్టాల పంజరాన్ని మనోవికార పంకిలాన్ని కొని తెచ్చుకుంటాడు. దానికి నిదర్శనం అర్జునుని పౌత్రుడు అభిమన్యుని పుత్రుడు, చంద్రవంశకులతిలకుడైన రాజా పరీక్షిత్తు వనానికి మృగయా వినోదుడై వెడలి మార్గ మధ్యంలో శమీక మహర్షి ఆశ్రమానికి చేరి ఆర్యా! ''దాహార్తినై ఇటవచ్చితిని. నీరడుగుతుంటిని ''యనగా మౌని తపోదీక్షాబద్ధుడైమిన్న కుండిపోయాడు. సహనం తప్పిన భూపాలుడు ఆగ్రహించి దారి ప్రక్కన చచ్చిపడిన సర్ప కళేబరాన్ని ఆ ముని మెడయందు వేసి ఇంటికి వెళ్ళాడు. ఆపై ఈ నిష్కారణ కోపం వల్ల పరీక్షిత్తు శృంగి అనే శమీక ముని కుమారుని చేత శాపగ్రస్తుడయ్యాడు. పశ్చాత్తా పచిత్తుడై రాజు తన అపరాధం తెలిసికొని శ్రీహరిని మనస్సునందువుంచుకొని భాగవత కథా శ్రవణం చేసి సన్మార్గాన్ని పొందినాడు.

# భగవన్నామ స్మరణం
## (భక్తుని రక్షా కవచం)

ఈ సృష్టి యావత్తూ భగవంతుని గృహమే. వారి గృహంలో మానవుడు తనకంటూ ఒక గృహాన్ని ఏర్పరచుకున్నాడు. ఎన్ని వృత్తులు, ప్రవృత్తులు ఉన్నా చివరికి తాను చేరుకునేది ఇంటికే.

ఉదయించే సూర్యుడు సాయం సంధ్య కల్లా పడమటి కనుమల చాటుకు కనుమరుగైపోతాడు. పక్షులు వాటి వాటి గూళ్ళకు అవి చేరుకుంటాయి. పశువులు అవి నిత్యం నివసించే చోటుకు తరలి వెళ్లుంటాయి. మనిషి కూడా తన వృత్తిని ముగించుకొని తన గృహానికి చేరుకుంటాడు.

ఈ విధంగా ఈ ప్రకృతిలో ప్రతిజీవి, ప్రతివ్యక్తీ సాయం సమయాని కల్లా తమ తమ విడిదికి చేరుకోవడంలో దాగి వున్న ఆంతర్యం? - అలసిన దేహానికి విశ్రాంతి నివ్వడమే!

దేహానికి తగిన విశ్రాంతి నిస్తున్నాము. సరే! మరి అలుపెరుగని ఆలోచనలతో పరుగులిడే మనసుకు కూడా విశ్రాంతి నివ్వాలి కదా! విశ్రాంతిలో శాంతి ఉన్నది. శాంతిలో ఆనందమున్నది. ఈ శాంతి, ఆనందము కోసమే కదా మనిషి తన దేహానికి కొన్ని అపథ్యపదార్థాలను (కాఫీ, టీ, మద్యపానము.....) అందచేస్తున్నది? ఈ శాంతి ఆనందము కోసమే కదా తాను తన మనసుకు కొన్ని దుర్విషయములను అలవాటు చేస్తున్నది? తాను అలవాటు చేసుకునే విషయాలన్నీ దుర్విషయాలు కాకపోవచ్చు. అలాగని అవి తనకు పూర్తి మేలు చేస్తున్నాయని కూడా చెప్పలేము.

ఏ శాంతి కోసం, ఏ ఆనందం కోసం తాను విషయాలను అనుభవిస్తున్నాడో అవి తనకు శాంతిని యివ్వాలి. తన ఉన్నతికి తోడ్పడాలి. ఆనందాన్ని పంచాలి. ఆరోగ్యాన్ని పెంచాలి. కాని భౌతిక విషయాలు శాంతిని ఇచ్చినట్లే యిచ్చి అశాంతికి గురిచేస్తున్నవే! ఆనందాన్ని పంచినట్లే పంచి అనారోగ్యాన్ని పెంచుతున్నవే!

మరి ఏమిటి దీనికిక పరిష్కారం?

సర్వదా యోగ్యమైన యోగమార్గాన్ని ఎంచుకొని ఆ మార్గం ద్వారానే నీవు కోరుకునే శాంతిని, ఆనందాన్ని పొందడమే దీనికి తగిన పరిష్కారం.

నీవు విశ్రమించడానికి నీ ఇంట్లోనే నీకంటూ ప్రత్యేకమైన చోటొకటున్నట్లు నీ మనస్సు కూడా విశ్రమించడానికి దానికి దేహమనే నీ యింట్లోనే ఒక ప్రత్యేకమైన పరమపవిత్రమైన చోటు ఒకటి వుంది. అది గంగా, యమునా, సరస్వతుల త్రివేణీ సంగమ స్థానం.

మందర, కైలాస, మహమ్మేరు గిరులకు అది నివాస స్థానం.

దివ్యజ్ఞానకాంతినీ ప్రసరించే సౌజ్ఞాశ్రీసూర్య నారాయణులకు నిలయమది.

చిత్రమైన కళలు, చిత్కళలను వెదజల్లే "త్రికూట" మది.

తన దివ్య దర్శనాలతో నీ నేత్రేంద్రియమునకు నయనానందము గొల్పి,

తన దివ్య నాదములతో నీ కర్ణేంద్రియమునకు

లయయోగము నేర్పి,

తన దివ్య పరిమళముతో నీ ఘ్రాణేంద్రియములను పరవశింపజేసి

తన దివ్యామృతముతో నీ జిహ్వేంద్రియమునకు షడ్రుచులను చూపించి

ఇలా సకలేంద్రియములకును మనసునకును దివ్యానుభూతులను చేర్చి కూర్చే 'యోగనిలయ'మది.

అదే త్రివేణీ సంగమ స్థానం. దీనినే త్రిపుటి, భృకుటి అని కూడా అంటారు. భృకుటి అనగా భ్రూమధ్యస్థానం.

ఈ స్థానానికంతటి ప్రాముఖ్యత ఉంది కాబట్టి పెద్దలు ఈ స్థానంలో 'తిలకధారణ' మనే సంప్రదాయాన్ని ఏర్పాటు చేశారు. అట్టి భృకుటిని మనకి పరిచయం చేసేవారు - సద్గురువు.

అందున్న పరమాత్మతో ధ్యానప్రక్రియ ద్వారా మనకు మచ్చిక కుదిర్చేదీ - సద్గురువే.

పరమాత్మతో మచ్చిక 'నాకు మనఃశాంతి కావాల'నే ఎన్నో యేళ్లనాటి తన ముచ్చటను తీరుస్తుంది.

ఆ శాంతిలో దివ్యశక్తి ఉన్నది.

ఆ శక్తియే దివ్యౌషధమై దేహ ఆరోగ్యాన్ని పరిరక్షిస్తుంది.

వజ్రకవచమై మనసును బలహీనతల నుండి కాపాడుతుంది.

పరిష్కారకర్తయై జటిల సమస్యలను సైతం సున్నితంగా పరిష్కరిస్తుంది.

సంస్కరణకర్తయై నీలోని కామ, క్రోధ, లోభ, మోహ, మద, మాత్సర్యములనే దొంగలను సంహరించక సంస్కరించి - నిష్కామ, శాంత, దానశీల, నిర్వికార, నిరంహంకార, నిష్కపటులనే యోగ్యులుగా తీర్చిదిద్దుతుంది.

ప్రశాంతత.... ఆనందం... ఆరోగ్యం.... పరిష్కారం..... సంస్కరణ ఇలా ఎవరికేది ఎప్పుడు కావాలనుకున్నా గురుకృపతో త్రివేణీ సంగమంలో తన యిష్టదైవధ్యానాన్ని ఆరంభించవలసిందే. ఆస్వాదించవలసిందే.

పదపదండి త్రివేణీ సంగమానికి, నిర్మల ధ్యానానికై.... త్వరపడండి నిత్యశాంతికై.

ఓం ప్రశాంతిః ●

# ఆది గురువు ఆచార్య శంకరులు

- శ్రీమతి జానమద్ది స్వర్ణలతా జోషి

**శ్రీ శంకరుల బ్రహ్మచర్యాశ్రమము :**

కేవలం ఐదేళ్ళ వయసులో వేదాధ్యయనం ప్రారంభించిన శంకరులు ఏ గురువు దగ్గరా ఎక్కువ కాలం నిలబడలేదు. ఆ ఏకసంధాగ్రాహికి నాలుగు వేదాలు, వేదాంగాలు, షడ్దర్శనాలు చదవటానికి కేవలం మూడేళ్ళ సమయం పట్టింది. ఇలాంటి ప్రతిభాశాలి ఇప్పటిదాకా ఈ జగత్తులో ఇంకొకరు లేరంటే అది అతిశయోక్తి కాదేమో! నాలుగు వేదాల అధ్యయనంలో చతుర్ముఖ బ్రహ్మలాగ, షడంగాలో అధ్యయనంలో గర్గ మహిర్షిని, వేదములను తాత్పర్యవర్ణనతో బృహస్పతికి సమానంగాను, వేదోక్త కర్మల వివరణలో జైమిని మహర్షి వేదసారమైన తత్వార్థ ప్రతిపాదనలో వేదవ్యాసుడిలాగాను ప్రకాశించాడు. అలాగే న్యాయ, సాంఖ్య, వ్యాకరణ పూర్వ మీ మాంసలు ఆయనకు కరతలామలకం. అద్వైత సిద్ధాంతాన్ని సంపూర్ణంగా ఆకళింపు చేసుకున్న ఈ విద్యాసాగరుడిలో మిలిగిన విద్యలన్నీ, సముద్రంలో నదులవలె వచ్చి చేరాయి. ఎనిమిదేళ్లకే గురుకుల వాసాన్ని ముగించి బ్రహ్మతేజంతో వెలిగే అతనిని చూచిన పిన్నలు, పెద్దలు అందరూ గౌరవించేవారు. మాతృసేవ చేస్తూ కొంతకాలం బ్రహ్మచర్య జీవితం గడపాలనుకున్నాడు. సకల విద్యాపారంగుతుడైన తన పుత్రుని చూచిన ఆర్యాంబ వీలైనంత త్వరగా వివాహం చేయ సంకల్పించింది.

**శ్రీ శంకరుల తపస్సిద్ధి :**

ఆదర్శ బ్రహ్మచారి, వ్రతనిష్ఠుడు అయిన శ్రీశంకరుల గొప్పదనాన్ని లోకానికి తెలియజేయడానికి పరతత్వం సంకల్పించింది. అందుకు సరియైన సన్నివేశాన్ని కూడా సృష్టించుకొంది. యథాప్రకారంగా భిక్షాటనం చేసి శంకరులు ఆనాడు ఒక ఇంటి ముందు నిలబడి "భవతీ భిక్షాం దేహి" అని వేడుకున్నాడు. ఆ అడగటంలో ప్రత్యక్ష, పరోక్ష అర్థాలు రెండూ వున్నాయి. ఆ ఇంటావిడ బయటికి బ్రహ్మ తేజారూపమైన ఆ బాలబ్రహ్మచారిని చూచి ఆశ్చర్యపడింది. భిక్ష వేయకుండా త్రిప్పి పంపటానికి తల్లి మనస్సు ఒప్పుకోలేదు. ఇవ్వడానికి ఏమీలేదు. ఆమె ఇంటిలో దరిద్రదేవత స్థిరనివాసియై వుంది. ఆ చిన్ని బ్రహ్మచారికి ఏమీ ఇవ్వలేకపోతున్నానన్న బాధతో ఆమె బయటకు వచ్చి 'బాబూ! మేము చాలా దురదృష్టవంతులము. సాక్షాత్తు బ్రహ్మస్వరూపమైన నీకు భిక్ష వేయడానికి మా దగ్గర ఏమీ లేని నిరుపేదలం. ఇలాంటి జన్మభూమికి భారమే కదా! అని చాలా బాధపడింది. అయినా మనస్సు ఉండలేక ఇల్లంతా మరొకసారి సోదాచేసి ఎక్కడోవున్న ఎండిపోయిన 'ఉసిరికాయ'ని తెచ్చి ఆ బాలబ్రహ్మచారి జలెలో వేసింది. నిండుమనసుతో మనం భగవంతుడికి దేనిని సమర్పిస్తామో, అది పదింతలై వెనక్కి తిరిగి మన దగ్గరకే వస్తుంది. అలా వేస్తూవుంటే ఆమెకు తన

సర్వస్వం సత్పాత్రునికి దానం చేస్తున్నానన్న భావన కలిగింది. కరుణా జనకమైన ఆమె స్థితికి శంకరులు కరిగిపోయారు. శ్రీమహాలక్ష్మిని గురించి మనసా ప్రార్థన చేశాడు. దేవతలు మంత్రబద్ధులు కదా! శంకరుల స్తోత్ర పాటవానికి శ్రీమహాలక్ష్మి సంతోషించి, ప్రత్యక్షమైంది. శంకరులు ఆమెకు నమస్కరించి 'జగజ్జననీ! ఈమెకు సకలైశ్వర్యాన్నీ అనుగ్రహించు' అని ప్రార్థించాడు. అందుకు లక్ష్మీదేవి శంకరులలో ఇలా అన్నది. "అయ్యా, బ్రహ్మచారి! నా భర్త విష్ణుమూర్తి ఆజ్ఞ ఇలా వుంది వెనుకటి జన్మలలో ఎవరు దాన ధర్మాలు చేశారో వాళ్ళకు మాత్రమే ఐశ్వర్యాన్ని అనుగ్రహించు" అని జవాబిచ్చింది. " ఈ స్త్రీ వెనుకటి జన్మలో ఎలాంటి దానధార్మలు చేయలేదు. మహా విష్ణువు యొక్క ఆజ్ఞను నేను మీరలేను" అన్నది. దానికి శంకరులు వెనుకటి జన్మ సంగతి అలావుంచు తల్లి. ఈ జన్మలో సత్పాత్రునికి దానం చేసింది కదా! మరి దానికి ఇప్పుడే ఫలితాన్ని ఇవ్వవచ్చుకదా! పాప-పుణ్యాలకు ఫలం వెంటనే లభిస్తుందని చెబుతారు కదా! ఆ మాటలకు ప్రసన్నురాలైన లక్ష్మీదేవి మనసు కరిగి బంగారు ఉసిరికాయల వర్షం కురిపించింది. 'కనకధారా స్తుతి' ద్వారా శంకరులు ఆమెను స్తోత్రం చేశారు. మచ్చుకొక పద్యం.

గీర్దేవతేతి గరుడధ్వజ సుందరీతి
శాకంభరీతి శశిశేఖర వల్లభేతి।
సృష్టిస్థితి ప్రలయ కేలిషు సంస్థితాయైః
తస్మై నమః త్రిభువనైక గురోస్తరుణ్యై॥

(వాగ్దేవి అని, గరుడ ధ్వజుడైన మహావిష్ణువు యొక్క అర్ధాంగి అని, శాకంభరి, చంద్రశేఖరుని అర్ధాంగి అనీ జగత్తు యొక్క సృష్టి, స్థితి, లయలకు నిమిత్తమైన దానివని మూడు లోకాలకూ అధిపతి, సద్గురువైన శ్రీ మన్నారాయణుని పత్నివైన నీకు నమస్కారములు" అని స్తుతించినారు. ఆ తరువాత మహాలక్ష్మి అంతర్ధానమైంది. ఈ మహిమను ప్రత్యక్షంగా చూచిన వారికి, పరోక్షంగా విన్నవారికీ మహదానందం కలిగి, శంకరులపై భక్తి శ్రద్ధలు పెంపొందాయి.

**శ్రీ శంకరుల మహిమ :**

సర్వవిద్యాధిపతి సర్వభూతాధిపతి అయిన భోళాశంకరుడే మానుష శంకరుడిగా అవతరించడంచేత శంకర బ్రహ్మచారిని చూచిన వేదజ్ఞులు, శాస్త్రజ్ఞులు, పండితులు, విద్వాంసులు అతనిని వేనోళ్ళ వర్ధించి ఆనందపడ్డారు. అతని శరీర సౌందర్యము, ముఖ కవళికలు, అతనిలోని సద్గుణాలు, అపరిమితమైన తేజస్సు, సకల విద్యల సమన్వయము, నయవినయాలు, వ్యవహారము, గాంభీర్యము, జనప్రియ భావము ఎందరినో ఆకట్టుకున్నాయి. ఆయనను చూచిన వారు మైమరిచిపోయేవారు. పరమేశ్వరుడే దక్షిణామూర్తిగా అవతరించి శంకరులుగా వటవృక్షం క్రింద వున్నాడో ఏమో! అని కొందరు భావుక భక్తుల విచారము. మరికొందరు మహేశ్వరుడి అవతారమని భావించి ఆయనను ఇలా స్తుతించారు.

**ఆచార్యుల మాతృసేవ :**

సకల విద్యా పారంగతులైన ఆచార్యులు తమ ఏడవ యేటనే నేర్వవలసిన దంతా నేర్చుకొని మాతృసేవా తత్పరులయ్యారు. ఒకనాడు నదీస్నానానికి వెళ్ళిన తల్లి మార్గాయాసంతో రావడంతో ఆలస్యం జరిగింది తల్లిని వెదకుతూ వెళ్ళిన శంకరులు

ఆయాసం తీర్చుకుంటున్న తల్లిని నలుగురి సహాయంతో ఇంటికి తీసుకొచ్చాడు. తామర పూలతో వింజామర చేసి దానితో గాలివీచి తల్లిని సేదదీర్చాడు. ఇంటికి సమీపంగా ప్రవహించమని నదీదేవిని ప్రార్థించాడు. దానికి నదీదేవత ప్రత్యక్షమై 'రేపు నీకోరిక తీరుతుంది' అని వరమిచ్చింది. పదిమంది మంచిని కోరే వాడికి కూడా మంచి చెయ్యాలన్నది ప్రకృతి నియమము. అలా ఆచార్యుల కోరిక తీరింది. మరుదినం లేవగానే నది ఇంటికి దగ్గరలోని ప్రవహించడం చూచాడు. శంకరులు చూపిన ఈ అద్భుతానికి జనులందరూ ఆశ్చర్యపడ్డారు.

నదిని ఇంటికి తెచ్చిన ఆచార్యుల గురించి ఆ దేశపు రాజుకు కూడా తెలిసింది. చిన్న వయస్సుగల అంతటి గొప్ప తపస్సంపన్నుని, సిద్ధుని చూడాలనిపించి ఆహ్వానం పంపాడు. 'బ్రహ్మచర్యాశ్రమ నియమాలను వదలి రాజదర్శనం చేయవలసిన అవసరమేముంది ? రాజు ఇచ్చే ధనకనాదులు అవసరం లేదు' అని భావించిన ఆచార్యులు రాజుగారి ఆహ్వానాన్ని మన్నించలేకపోయారు. రాజుకు ఈ సంగతి తెలిసి, తానే ఆచార్యులు దర్శనానికి వచ్చాడు. పదివేల బంగారు నాణ్యాలను కానుకగా సమర్పించి, తాను రచించిన మూడు నాటక గ్రంథాలను పరిశీలించవలసిందిగా కోరాడు. అప్పటికే ధనవ్యామోహాన్ని అధిగమించిన ఆచార్యులు 'రాజా! ఈ నాణ్యముల అవసరం నాకు లేదు. కారణం నేను బ్రహ్మచారిని కాబట్టి దీనిని ఎలా ఉపయోగించాలో తెలియదు. నీవే ఈ ధనాన్ని యోగ్యులైన గృహస్థులకు లేదా దీని అవసరం వున్నవాళ్ళకు పంచిపెట్టు.' అన్నారు. ఆయనలోని వైరాగ్యానికి ఇదొక ఉదాహరణ. ఈనాడు కూడా విరక్తులకే ధనాన్ని దానంగా ఇవ్వడం జరుగుతూ వుంది. ఇది అతని భక్తికి తార్కాణం. కాని ఆచార్యులు సూచించినట్లుగా అవసరం వున్నవారికి పంచడం చేత ఆ ధనం సార్థకమవుతుంది. ఆచార్యులు మహారాజు రచించిన నాటక గ్రంథాలను పరిశీలించారు. తరువాత రాజుకు సంతానం కలిగేలా అనుగ్రహించారు. పుత్రప్రాప్తి కలిగేలా శుభ వైదిక కర్మను తెలియజేసి, 'నీ కోరిక నెరవేరనీ' అని శుభం పలికారు. రాజు తిరిగి వెళ్ళిపోయాక మళ్ళీ మాతృసేవలో లీనమయ్యారు.

**ఋషుల సందర్శనం :**

త్రికాలజ్ఞులైన మహర్షులు శంకరుల సందర్శనానికి వచ్చారు. ఉపమన్యుడు, దధీచి, గౌతముడు, త్రితల, అగస్త్యుడు మొ॥ ఋషులందరూ తమ ఇంటికి రావటంతో చాలా సంతోషపడ్డారు. ఇలాంటి బ్రాహ్మణోత్తముల దర్శనం దుర్లభమని భావించిన ఆచార్యులు మహదానందంతో

విప్రేషు దర్శనాత్ సద్యః క్షీయంతే పాపరాశయః
వందనాన్మంగళా వాప్తి రర్చనాదచ్యుతం పదమ్

అన్నారు. అంటే బ్రాహ్మణుల సమూహాన్ని చూచినంత మాత్రానికే పాపరాశి నాశనమవుతుంది. నమస్కరిస్తే మంగళ ప్రదమవుతుంది. వారిని పూజిస్తే శాశ్వత స్వర్గలోక ప్రాప్తి కలుగుతుందని భావం. తపస్సిద్ధులు, మహాశ్రుత్రియులు. బ్రహ్మశ్రీ విరాజమానమైన మహర్షులను ఆచార్యులు స్వాగతించి నమస్కారమాడి అర్ఘ్యపాద్యాదులను అర్పించి కూర్చుండబెట్టారు. ఆచార్యులలో ఆ మహర్షులు కొంతకాలం తత్త్వవిచారగోష్ఠి జరిపారు.

తరువాయి 32వ పేజిలో......




(గత సంచిక తరువాయి)

**రఘుమహారాజు అభ్యుదయం**

తండ్రి యిచ్చిన రాజ్యం స్వీకరించి సాయం సమయంలో సూర్యుడినుండి తేజస్సు గ్రహించిన అగ్నిలాగా రఘుమహారాజు జాజ్వల్యమానుడై ప్రకాశించాడు. దిలీపుడి కాలంలో శత్రురాజుల గుండెల్లో కుములుతూ వుండిన సంతాపాగ్ని రఘువు రాజైనాడని వినగానే మంటలు గ్రక్కుతూ పైకెగసింది.

జాతరలో నిలబెట్టిన ఇంద్రధ్వజాన్ని చూచినట్లు క్రొత్తగా రాజ్యంలో ప్రతిష్ఠితుడైన రఘుమహారాజు అభ్యుదయం కళ్లారా చూచి బిడ్డలతో సహ ప్రజలందరూ ఎంతో సంతోసించారు. గజగమనుడైన రఘువు తండ్రినుండి సంక్రమించిన సింహాసనంతో పాటు శత్రుమండలాన్ని గూడా ఆక్రమించాడు. అప్పుడు రాజ్యలక్ష్మి తాను కంటికి కనబడకనే తామరగొడుగు పట్టి అతణ్ణి సేవిస్తున్నదా అన్నట్లు అతనిలో ఒక వింత ఛాయ గోచరించింది. సరస్వతి స్తుతిపాఠకులలో నెలకొని ఉచితకాలాలలో స్తవనీయుడైన అతణ్ణి అర్థవంతమైన స్తుతులతో పూజించింది.

మనువు మొదలైన మహారాజు లెందరో పూర్వం భూమిని అనుభవించారు. అయినా రఘువును ఆమె మొట్టమొదటి పతిలాగా ప్రేమించింది. ఎక్కువ చలీ, ఎక్కువ వేడీ లేని మలయమారుతంలాగా, అతడు మిక్కిలి తీక్ష ణమూ, మిక్కిలి మృదువూ కాని యుక్తదండం విధించడంవల్ల అందరి మనసులూ ఆకట్టుకొన్నాడు.

కాపు కనిపించిన తర్వాత మామిడి పూతమీద ఔత్సుక్యం తగ్గినట్లే గుణాధికుడైన రఘువు పరిపాలన చవిచూచిన తర్వాత ప్రజలకు అతని తండ్రిమీద ఔత్సుక్యం తగ్గిపోయింది. నీతివేత్తలైన అమాత్యులు అతనికి ధర్మయుద్ధం మొదలైన సత్పక్షాన్నీ, కూటయుద్ధం మొదలైన అసత్పక్షాన్నీ రెండిటినీ బోధించారు. అందులో అతడు సత్పక్షాన్నే సదా అవలంబించేవాడు. అతని పరిపాలనలో పృథివి మొదలైన పంచభూతాలు మహోత్కృష్టంగా తమ గుణాలను పెంపొందించుకొన్నాయి. రాజు క్రొత్తవాడయ్యే సరికి ఆ రాజ్యంలో ప్రతిదీ క్రొత్తదిగానే గోచరించింది. ప్రజలను ఆహ్లాదపరచేవాడు కాబట్టి 'చంద్రుడు' అనే పేరు చంద్రుడికీ, తపింపజేసేవాడు కాబట్టి 'తపనుడు' అనే పేరు సూర్యుడికీ సార్థకమైనట్లే ప్రజలను రంజింపజేయటంవల్ల రఘువుకు 'రాజు' అనే పేరు సార్థకమైంది. చెవులవరకూ వ్యాపించిన సువిశాలమైన నేత్రాలున్నా సూక్ష్మాతి సూక్ష్మమైన కార్యమార్గాలను గమనించే శాస్త్రదృష్టే అతనికి ముఖ్యదృష్టిగా వుండేది. అతడు రాజ్యంలో చక్కగా కుదురుకునే సరికి రెండవ రాజ్యలక్ష్మిలాగా పద్మచిహ్నాలతో శరదృతువు సంప్రాప్తమైంది. వాన కారు మబ్బులు ఆకాశంనుండి తొలగిపోగానే సూర్యప్రతాపంతో సహా జైత్రయాత్రకు బయలుదేరిన రఘుమహారాజు ప్రతాపం కూడా సహింపరానిదై

దిక్కులన్నిటా వ్యాపించింది. ఇంద్రుడు వర్షం కల్గించే తన ధనువు దించగానే రఘువు జయసాధనమైన తన ధనుస్సు పైకెత్తాడు. ఇద్దరూ ప్రజాక్షేమం కొరకు ధనుస్సులను ధరించేవారే కదా!

తెల్లదామర గొడుగుతోనూ, రెల్లుపూల వింజామరలతోనూ శరదృతువు రఘుమహారాజును అనుకరించిందే కాని అతని కాంతిని పొందలేకపోయింది ప్రసన్న ముఖుడైన రఘువునూ, నిర్మలకాంతిగల చంద్రుణ్ణి ప్రజలు సమానానురక్తితో చూచి ఆనందించారు. రఘువుకీర్తి తమపై వ్యాపించినందువల్ల కాబోలు హంసలూ, నక్షత్రాలూ, తెల్లగలువలతోడి నీళ్ళూ - తెల్లతెల్లగా ప్రకాశించాయి. పైరుకాపరి పడతులు చెఱుకుతోటల నీడల్లో కూర్చొని రఘుమహారాజు బాల్యమాదిగా చేసిన ఇంద్రవిజయాది వీరకృత్యాలను పాటలుగా పాడారు. మహాతేజస్వి అగస్త్యుడు నక్షత్రరూపంలో ఉదయించగానే నీరు తేటపడింది. మహాపరాక్రమశాలి రఘువు అభ్యుదయం పొందగానే శత్రురాజుల మనస్సు కలత జెందింది. గొప్ప మూపురాలు గలిగి ఏటి గట్టులు గోరాడే మదించిన ఆబోతులు ఆజానుబాహువై శత్రువులను చీల్చిచెండాడే రఘుమహారాజు పరాక్రమ విలాసాన్ని అనుకరించాయి. మదజల వాసనగల ఏడాకుల అరటిచెట్ల పూల తాకిడికి అసూయపడ్డాయా అన్నట్లు అతని ఏనుగులు తమ శరీరంలో ఏడు చోట్ల నుండి మదజలం కార్చాయి.

(సశేషం)

30 వ పేజి తరువాయి ......

తరువాత ఆర్యాంబ వారిని సందర్శించి "పూజ్యులారా! ఇలాంటి కలియుగంలో సజ్జన సందర్శనమే దుర్లభము. తమలాంటి తపస్విజనుల దర్శనం లభించడం నా పూర్వపుణ్య ఫలము ఈ నా బిడ్డడు ఇతడు ఏ తపస్సు చేస్తున్నాడో నేను ఎరుగను. ఇతని మహిమ అపారము. ఇతని సాధనా పటిమను గురించి మీరు చెబితే నేను వినగలను' అని ప్రార్థించింది అందుకు ఆ ఋషులు 'అమ్మా! నీవు నీ భర్తతో కూడా పుత్రప్రాప్తికోసం పరమేశ్వరుని గురించి తపస్సు చేశావు. నీ అదృష్టం కొద్దీ ఆ పరమేశ్వరుడు తానే నీ కొడుకుగా అవతరించాడు. నీవు ధన్యురాలవు' అన్నారు. ఆర్యాంబ అంతటితో ఊరుకోక "మహాత్ములారా! ఈ నా బిడ్డ ఆయుష్షు ఎన్నేళ్ళు ? అని అడిగింది. అగస్త్యమహర్షికి ధర్మసంకట పరిస్థితి. అప్రియమైనప్పటికీ నిజం తెలియజేయవలసిన సమయం వచ్చింది. 'సత్యం బ్రూయాత్ ప్రియాబ్రూయాత్ న బ్రూయత్ సత్యమప్రయి' అంటుంది సనాతన ధర్మం. కాని అగస్త్యులు కఠోర సత్యాన్ని చెప్పడానికే నిశ్చయించుకున్నారు. అప్పుడా మహర్షి "అమ్మా! ఈ బిడ్డకు విధి నిర్ణయించిన వయసు ఎనిమిదేళ్ళు. తరువాత తను అనుష్ఠానములకు, ఆశ్రమ జీవిత నిర్వహణకు, లోకోపకారానికి మరో పదహారేళ్ళు లభిస్తాయి'' అన్నారు. ఇది విన్న ఆర్యాంబకు తీరని దుఃఖం కలిగింది. ఆమె మాతృహృదయం తల్లడిల్లింది. కాని ఆ బాలబ్రహ్మచారి చెదరని ధీమంతుడు. తన జీవితంలో మిగిలిన ఆ కొంత కాలాన్ని సన్యాసిగా గడపటానికి సంకల్పించారు. తరువాత ఋషులందరూ తమ తమ స్థానాలకు వెళ్ళిపోయారు.

ఆంధ్రప్రదేశ్ - తెలంగాణలలో

# దర్శనీయ దేవాలయాలు - చారిత్రక ప్రదేశాలు

## భద్రాచలం (తెలంగాణ - ఖమ్మం)

శ్రీ రోహిణి మహేష్, M.A., L.L.B., కన్నావారి తోట 2వ లైను, 27-9-54, గుంటూరు - 522 004

(గత సంచిక తరువాయి)

**జన్మదినం నాడే రాముని వివాహం**

త్రేతాయుగంలో ఫాల్గుణ పూర్ణిమ నాడు జనకుని కొలువులో శ్రీసీతారాముల కళ్యాణం వైభవంగా జరిగింది. కాని భద్రాదిరాముడు చైత్రశుద్ధ నవమినాడు పునర్వసు నక్షత్రయుక్త కర్కాటక లగ్నంలో జన్మించాడని పేర్కొంటూ చైత్రశుద్ధనవమినే శ్రీరామనవమిగా భావిస్తూ స్వామి పుట్టిన రోజునే కళ్యాణం జరిపించడం ఆనవాయితీగా వస్తోంది. "యస్యావతార సమయః తస్య కళ్యాణ మాచారేత్ (ఏదేవుని అవతార సమయమో ఆ రోజున ఆ దేవుని కళ్యాణం ఆచరించాలి) అన్న పాంచరాత్రాగమ సంప్రదాయం ప్రకారం నాడే సీతారాముల కళ్యాణం చేయడం జగత్ కళ్యాణం కోసమేనని పెద్దలు చెబుతారు.

**అభిజిల్లగ్నం**

స్వామివారి కళ్యాణం ప్రతి సంవత్సరం మధ్యాహ్నం 12 గంటలకు అభిజిల్లగ్నంలోనే చేయడం ఆనవాయితి. "సూర్యాచ్చతుర్థం యల్లగ్నం మభిజిత్సంజ్ఞ కంచితమే సర్వేదే శేష్విదం ముఖం, సర్వవర్గీషు చతుర్లుభమే "అన్న నానుడి ప్రకారం సూర్యుడు ఉన్న రాశినుంచి నాల్గవ లగ్నం ఏలగ్నమవుతుందో ఆలగ్నాన్ని అభిజిల్లగ్నం అని పిలుస్తారు. శుభప్రదమైన ఈ అభిజిన్ముహూర్తం అనేక దోషాలను పోగొడుతుంది. సర్వశుభకార్యములందు అభిజిన్ముహూర్తం మంగళకరమైనదని చెబుతారు.

**మాంగల్యధారణ**

భక్తరామదాసు చేయించిన మూడు మాంగళ్యాలతో కూర్చిన మంగళ సూత్రంతోనే సీతమ్మవారికి మంగళధారణ జరుగుతుంది.

**ఆకాశవాణి**

భద్రాచలంలో జరిగే కళ్యాణోత్సవాన్ని ఇప్పుడు మనం టెలివిజన్‌లో ప్రత్యక్షంగా చూస్తున్నాం. టెలివిజన్‌కు ముందు ఇక్కడ జరిగే సీతారాముల కళ్యాణాన్ని కళ్ళకు కట్టినట్లుగా తెలుగు ప్రజలకు వివరించిన వ్యాఖ్యాతలను స్మరించుకుందాం. దీనికివన్నెతెచ్చినవారు పురాణపండ ఉషశ్రీ, ఏలూరిపాటి అనంతరామయ్య, జమ్మలమడక మాధవరామశర్మ, ప్రసాదరాయకులపతి (ప్రస్తుత కుర్తాళం పీఠాధిపతి) ముఖ్యులు.

**ఇతర ఆలయాలు**

భద్రాచలంలో చూడదగిన ఇతర ఆలయాలు నరసింహస్వామి. యోగానంద నరసింహస్వామి, గోవిందరాజుల స్వామి, రంగనాయకులస్వామి ఆలయాలు, రామదాను ధ్యాన మందిరం, శివాలయం, ఈశ్వరమ్మ మందిరం, హరనాథ్ దేవాలయం, వేణుగోపాలస్వామి పీఠం.

**పర్ణశాల**

భద్రాచలానికి 35 కి.మీ. దూరంలో పర్ణశాల ఉంది. ఇక్కడ ఆలయంలో కూడా సీతారామలక్ష్మణుల విగ్రహాలు, వాటికి ఎదురుగా హనుమంతుడు, ప్రవేశ

ద్వారానికి కుడి ప్రక్క శ్రీలక్ష్మీనారాయణస్వామి, ఎడమ ప్రక్క శ్రీ వేణుగోపాలస్వామి విగ్రహాలున్నాయి.

పర్ణశాలలో జరిగిన సంఘటనలను బట్టి ఇక్కడ విగ్రహాలు పెట్టారు. ప్రవేశంలోనే మొదట కనబడేది రాముని కుడి పాదం, దానిప్రక్కనే లేడిపాదంగుర్తులు, సీతారామలక్ష్మణులు, లేడి విగ్రహాలు, సీతలక్ష్మణుని వెళ్ళమని చెప్పే విగ్రహం, రావణాసురుడు జంగం దేవర వేషంలో సీతమ్మవారిని బిక్షం అడగటం, సీతమ్మవారు బిక్షం తీసుకొని వచ్చి లక్ష్మణరేఖని దాటి రావణుని చూసి మూర్ఛపోవటం, పది తలల రావణుడు సీతమ్మ వారిని ఎత్తుకు పోవటం, సీత పాదాలు ఇవి అన్ని చూపురులను ఇట్టే ఆకర్షిస్తాయి.

వామన గుంటలుగా పిలిచే మరో ప్రదేశం ఉంది. ప్రతి రోజు సీతారాములు కాలక్షేపానికి ఇక్కడ వామన గుంటలు ఆడుకునే వారని చెబుతారు. అలాగే భోజనం చేయడానికి వీలుగావున్న నాటి రాతి పళ్ళెంకూడా ఒకటి ఉంది. సీతమ్మవారుస్నానం చేస్తున్నప్పుడు రాక్షసుల బారి నుంచి రక్షణగా రాములవారు రాతిమీద కూర్చున్న చోటును ఆయన సింహాసనంగా చెబుతారు. సీతమ్మవారు స్నానంచేసి చెట్టుక్రింద కూర్చొని జుట్టు ఆరబెట్టుకునేవారట. ఆ చెట్టును సీతమ్మ తల్లి వృక్షం అని అంటారు. లక్ష్మణుడు శూర్పణకు ముక్కుచెవులు కోసిన ప్రదేశం కూడా ఇదేనని చెబుతారు. పర్ణశాలలోను రాముడ్ని "విచారరాముడు" అని అంటారు.

**లక్ష్మణగుట్ట**

పర్ణశాలకు వెళ్ళే మార్గంలో గోదావరి తీరాన లక్ష్మణ గుట్టఉంది. ఈ గుట్ట (పర్వతం)పై నుంచే లక్ష్మణుడు సీతమ్మకు రాక్షస బాధ కలగకుండా కాపలా ఉన్నాడని చెబుతారు.

**సీతవాగు**

ఇక్కడ గోదావరిలో ఒక వాగు కలుస్తుంది. దీన్ని సీతవాగు, పద్మసరస్సు అని అంటారు. ఈ ప్రవాహం మధ్యలో కుర్చీలాగ ఒక చిన్న గుట్టఉంది. దీని మీదనే సీతాదేవి కూర్చొని స్నానం చేసిందని, తనకుమార్తెకు స్నానార్థము నలుగు, పసుపు, కుంకుమ అందజేయుటకు భూమాత ఆ కొలను చుట్టూ చిన్నచిన్న రాళ్ళను చేర్చి పెట్టిందని వాటిలోని తెల్లరాయినుండి సున్నిపిండి, పసుపురాయి నుండి పసుపు,, ఎర్రరాయి నుండి కుంకుమ సీతాదేవికి అమర్చుచుండేదని చెబుతారు. ఆరాళ్ళు ఈ నాటికీ కనిపిస్తుంటాయి. ఇంతకన్నా విచిత్రం మరొకటి ఈ రాళ్ళమీద ఒకనల్లని చార 20 అడుగులపొడవు, 7 అంగుళాల వెడల్పున కనిపిస్తుంది. ఇది సీతాదేవి ఆరవేసుకున్న చీర గుర్తులు అని చెబుతారు.

**శబరి వాగు**

పర్ణశాలకు దగ్గరలోనే రథగుట్ట మీదనే రావణుడు తన రథాన్ని దింపి పర్ణశాలకు జంగం దేవర వేషంలో వచ్చినట్లు చెబుతారు. ఇక్కడ శబరివాగు ఉంది. ఇది గోదావరికి ఉపనది. కూనవరం దగ్గర గోదావరిలో కలుస్తుంది. భక్తురాలయిన శబరి ఆతిధ్యాన్ని మెచ్చి శ్రీరాముడు శబరికీ రూపాన్ని ప్రసాదించాడని చెబుతారు.

**యటపాక**

పర్ణశాలకు దగ్గరలో యటపాక అనే ప్రదేశం ఉంది. పర్ణశాల నుండి సీతమ్మవారిని రావణాసురుడు అపహరించి ఎత్తుకు పోతుండగా జటాయువుఅనే పక్షి తన ప్రాణాలకు తెగించి రావణాసురుడితో పోరాడుతున్నప్పుడు ఒక రెక్కభాగం తెగిపడిన ప్రదేశం ఇదేనని చెబుతారు. అప్పటి నుంచి ఈ ప్రాంతం జటపాక, జటాయువుపాకగా పిలువబడి కాలక్రమంగా

యటపాకగా మార్పు చెందింది. జటాయువు రెండవ రెక్క 'రేఖపల్లి' లో పడింది. రెక్కపల్లిగా ఉన్న ఈ ఊరిపేరు కాలక్రమంగా రేఖపల్లిగా మార్పుచెందింది.

రావణుని చేతిలో రెక్కలు పోగొట్టుకొని ఇక్కడ నేలకూలిన జటాయువు శ్రీరాముడు సీతను వెతుక్కుంటూ ఈ ప్రదేశానికి వచ్చినప్పుడు శ్రీరామునకు సీతాదేవి వార్తను చెప్పి శ్రీరాముని ఒడిలో ప్రాణాలను వదిలింది. ఈ ప్రదేశంలో ఉన్న రాముడ్ని "కులాసా రాము"డని పిలుస్తారు.

**ఉష్ణగుండం** : భద్రాచలంలో గోదావరి ఒడ్డున 2 మైళ్ళ దూరంలో ఉష్ణగుండం ఉంది. ఇక్కడెక్కడైనా సరే గుంటలు త్రవ్వితే వేడినీరు వస్తుంది. సీతమ్మవారి స్నానానికై శ్రీరాముడు ఒక బాణాన్ని నేలలోకి కొట్టగా లోపల్నించి వేడినీటిధారలు వచ్చాయని చెబుతారు.

**దుమ్ముగూడెం** : పర్ణశాలకు దగ్గరలో దుమ్ముగూడెం అను ప్రదేశం ఉంది. ఇక్కడే శ్రీరాముడు ఖరదూషణాది రాక్షసులను సంహరించి దహనం చేశాడని, ఆ దహన క్రియ ఫలితంగా బూడిద ఏర్పడిందని ఆ బూడిద దుమ్ము పేరుమీదనే ఆ గ్రామానికి దుమ్ముగూడెం అనే పేరొచ్చిందని చెబుతారు. రాముల వారు అంతమంది రాక్షసులను సంహరించటంతో సీతమ్మవారి ఆత్మ సంతోసించిందట. అందుకే ఈ ప్రాంతంలో కొలువైన రాములవారిని "ఆత్మారాము"డని అంటారు.

**భద్రాచలం బ్రిడ్జి** : పూర్వం బ్రిడ్జిలేనప్పుడు ప్రజలు కాలినడకన, ఎడ్లబండ్లపైన, నాటుపడవలు, లాంచీల్లో ఇక్కడకు చేరుకొనేవారు. 1955లో శ్రీరామ నవమి రోజున వేడుకల అనంతరం తిరుగు ప్రయాణంలో యాత్రికులు గోదావరి నది దాటుతుండగా 300 మంది చనిపోయారు. ఈ దుర్ఘటన పురస్కరించుకొని భద్రాచలం వచ్చిన నీలం సంజీవరెడ్డి గోదావరి నదిపై బ్రిడ్జి నిర్మాణానికి వాగ్దానం చేసి 1959 డిసెంబరు 16న బ్రిడ్జి శంకుస్థాపన చేసినాడు 70 లక్షల రూపాయలు నిధులు కేటాయించి 5 సంవత్సరాలలో పనులు పూర్తి చేయించి నాటి రాష్ట్రపతి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్‌చే 1965 జులై 13న బ్రిడ్జిని ప్రారంభించి జాతికి అంకితం చేశారు. 3934 అడుగుల పొడవుతో కాంక్రీటు స్తంభాలపై వారధి నిర్మించబడింది.

**ప్రధానోత్సవాలు**


రామదాసు గురువైన రఘునాథ్‌భట్టార్ నిర్ణయం ప్రకారం ప్రతి ఏడాది భద్రచలంలో శ్రీ సీతారాముల కళ్యాణము చేయడం ఆనవాయితీగా వస్తుంది. 1832 ప్రాంతంలో గుంటూరుకు చెందిన తూము నరసింహదాసు అను వాగ్దేయకారుడు ఈ పరిగణాకు తహసిల్దారుగా వచ్చి తన మిత్రుడైన వరదరామదాసు సహాయంతో శ్రీరామచంద్రునకు మేలుకొలుపు నుంచి పవళింపు సేవ వరకు పూజాది కార్యక్రమాలను శిలాశాసనం ద్వార లిఖించారు. నాటి నుండి ఆ సంప్రదాయం ప్రకారమే నేటికీ పూజాది కార్యక్రమాలు జరుగుతుండటం విశేషం.

నాడు తానీషా కాలం నుంచి వస్తున్న ఆచారం ప్రకారం ముత్యాల తలంబ్రాలును రాష్ట్ర ప్రభుత్వం ప్రతి సంవత్సరం సమర్పించడం జరుగుతుంది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత వస్తున్న మొట్టమొదటి శ్రీరామనవమి ఇది (2015).

చైత్రమాసంలో శ్రీసీతారామ కళ్యాణము చెప్పకోదగినది. రామదాను చేయించిన మాంగల్యంతోనే సీతమ్మవారికి మాంగల్యధారణ జరిపించడం విశేషం.

వైకుంఠ ఏకాదశి రోజులలో దశావతారములు రోజుకొకటి ప్రదర్శింపబడతాయి. వైకుంఠ ఏకాదశిన జరిగే వైకుంఠ ద్వార దర్శనం చెప్పుకోదగినది.

# శ్రీరామ భక్తి



## 2. సనకాది మునుల శ్రీరామభక్తి

- కీ.శే. డాక్టర్ రోహిణి వెంకట సుందరవరద రాజేశ్వరి

శ్రీసనకాదులు (సనక, సనందన, సనత్కుమార, సనాతనులు) బ్రహ్మమానసపుత్రులు. బ్రహ్మ తన శక్తితో నిర్మలాంతః కరణముతో వీరిని సృష్టించెను. వీరు చూచుటకు ఎల్లప్పుడు ఐదు సంవత్సరముల బాలకులవలె నుందురు. కాని శంకరుని కంటె (జన్మలో) పెద్దవారు. వీరు నిరంతరము "శ్రీహరిః శరణమ్" అను మంత్రమును జపించుచుందురు. వీరు అద్భుత తేజోమయులు, దీప్తి సంపన్నులు, సుందర గుణ శీలయుక్తులు, నిత్యము బ్రహ్మానందములో లీనమై యుండువారు. భగవానుని గుణములను గానము చేయుట, ఆధ్యాత్మిక చింతన, భగవత్ప్రేమ వీరిముఖ్య ధ్యేయములు. వాస్తవముగ ఈ నలుగురు బాలుర రూపములో నున్న నాలుగు వేదములే. ఈమునులు సర్వత్ర భేదబుద్ధి లేక యుండువారు.

బ్రహ్మసృష్టిలో వీరిని మనస్సంకల్పముతో ఉత్పన్నులను చేసి సృష్టిని పెంచుడని చెప్పగా వీరు ఒప్పుకొనలేదు. వీరి మనస్సు సర్వదా భగవానుని ఆత్మారామగుణాకర్షితమై మునిమనో మధుప నివాసహరి పద పంకజము లందుండును. అందువలన తపస్సు నందే వీరి మనస్సుండును. భగవద్భక్తియే వీరి ప్రాణము. భక్తితో తన పుత్రుడు జ్ఞాన వైరాగ్య యుతులగుటచే బ్రహ్మదుఃఖించుచుండ ఆ దుఃఖము పోగొట్టుడని శ్రీనారదుడు చెప్పగా సనకాదులు భాగవత కథను వినిపించి ఆయన దుఃఖమును తొలగించిరి.

నారదుడు భక్తిమార్గములో ఆచార్యులకు ఆచార్యుడు. అయినను నారద పురాణము పూర్తిగా పూర్వ భాగము వీరే నారదునకుపదేశించిరి. ఇందులో భక్తిని గురించి చాలాగొప్పగా చెప్పబడినది. వారు "నారదా! ఉత్తమమైన భక్తి మానవులకు కామధేనువు వంటిది. అది ఉండగా అజ్ఞానులైన మానవులు సంసారరూప విషమును గ్రోలుచున్నారు. ఇది ఎంతటి ఆశ్చర్యకరము. భగవద్భక్తుల సంగమము, శ్రీరామ భగవానునిపై భక్తి సహన స్వభావములే సారములేని సంసారులకు సారము" అనిరి.

నారద పురాణ తృతీయ పాదమందు శ్రీ సనకాదులు నారదునకు సపరికర రామోపాసనను విశదముగ ఉపదేశించిరి. రాముని ధ్యానస్వరూపము, మంత్రముల నుపదేశించుచు ''నారదా! సర్వమంత్రముల యందు వైష్ణవ మంత్రము శ్రేష్ఠమైనది. సర్వమంత్రములోను వైష్ణవ మంత్రము శ్రీఘ్రంముగ అభీష్ట సిద్ధినొనగును. వైష్ణవ మంత్రములలో కూడ శ్రీరామ మంత్రము అధిక ఫలమొసగును. ''రాం రామాయ నమః'' యను షడక్షర మంత్రము రామమంత్రము లన్నింటిలోను అతిశ్రేష్ఠమైనది. ఇది ఉచ్చరించినంత మాత్రముననే తెలిసి తెలియక చేసిన మహాపాత కోప పాతకములు వెంటనే నశించును. పంచాక్షరమగు రామాయ నమః అనుమంత్ర మందు స్వబీజము-రాం; కామబీజము-క్లీం; సత్య బీజము-హ్రీం; వాగ్బీజము-ఐం; లక్ష్మీబీజము-శ్రీం; తార- ఓం అనువాని నొక్కొ దానిని వేరువేరుగ చేర్చిన షడక్షర మంత్రమగును. ఎట్లనిన రాం రామాయ నమః; క్లీం రామాయ నమః; హ్రీం రామాయ నమః; ఐం రామాయ నమః; శ్రీం రామాయ నమః; క్లం రామాయ నమః; అను ఈ మంత్రములు

దర్మార్థ కామ మోక్షముల నొసగును. సాధకులకు రఘునాథుని చరణములపై అనంత భక్తి కల్గించును".

సనకాదులు శ్రీరాముని ఇతర మంత్రములను కూడ ఇట్లు చెప్పిరి. "ఓం రామ చంద్రాయ నమః; ఓం రామ భద్రాయనమః అను ఈ రెండును అష్టాక్షర మంత్రములు. క్లం నమో భగవతే రామచంద్రాయ; ఓం నమో భగవతే రామ భద్రాయ అను ఈ రెండును ద్వాదశాక్షర మంత్రములు. శ్రీరామ జయరామ జయ జయ రామ. ఇది త్రయోదశాక్షర మంత్రము". ఈ విధముగ శ్రీరాముని ఇతర మంత్రములు, సీతా, లక్ష్మణ, భరత, శత్రుఘ్న, హనుమదాది మంత్రములు వాని అనుష్ఠాన పద్ధతులను సనకాదులు నారదునకు ఉపదేశించిరి. సనత్కుమారునిచే చెప్పబడిన ధ్యానము అతి సుందరము. రామభక్తితో ఓతప్రోతము. రాముని ఎడల ప్రేమను వృద్ధి చేయునది.

సీతారాముల ధ్యాన స్వరూపమొకటి ఈ విధముగ నిర్దిష్టమైయున్నది.

**కాలామ్బోధర కాన్తం చ వీరాసన మాస్థితమ్।**
**జ్ఞానముద్రాం దక్షహస్తే దధతం జాను నీతరమ్॥**
**సరో రుహ కరాం సీతాం విద్యుదాభాం చ పార్శ్వగామ్॥**
**పశ్యన్తీం రామ వక్త్రాబ్జం వివిధా కల్ప భూసితమ్॥**

(నారద పురాణము పూర్వార్ధము)

శ్రీరాముని అంగకాంతి నల్లని మేఘమువలె శ్యామ వర్ణముగ నుండును. ఇతడు వీరాసనముతో కూర్చొనియుండును. దక్షిణ హస్తమందు జ్ఞానముద్ర దరించి, వామహస్తమును ఎడమ మోకాలిపై నుంచును. వామ పార్శ్వ మందు విద్యుత్ సమాన కాన్తిమతి వివిధ వస్త్ర భూషణ విభూసిత అయిన సీతాదేవి విరాజమానయై యుండును. ఆమె హస్తమందు కమల ముండును. తన ప్రాణవల్లభుని ముకారవిందమును ధ్యానముతో చూచుచుండును.

సనత్కుమారుల భక్తి పురాణముల యందును, వివిధ రామాయణములందును గలదు.

సనకాదులు శ్రీరాముడు రాజ్యాభిషిక్తుడయిన తరువాత ప్రతి దినము రాముని దర్శించుటకు వచ్చెడివారు. సనాకాదుల ప్రేమను గాంచిన శ్రీరఘునాధుడు వారి వలెనే ప్రేమ విహ్వలుడై వారివలెనే నేత్రముల నుండి ప్రేమాశ్రువులు ప్రవహించుచుండు, పులకితుడై తన భక్తులను పట్టుకొని కూర్చుండబెట్టి "మునీశ్వరులారా! నేడు నేను ధన్యుడను. మీ దర్శనముతో సమస్త పాపములు నశించెను. సత్సంగప్రాప్తి ఎంతయు భాగ్యము" అని అనెను.

భగవానుడు భక్తునకు ప్రేమికుడు, ప్రేమాస్పదుడునగు చున్నాడు. భగవానుని ఈ లీల ధన్యము. తమ ఆరాధ్యుడగు శ్రీరాముని వచనములు వినిన నలుగురు కుమారులు హర్షితులై ఈ విధముగ ప్రార్థించిరి.

"ప్రభూ! మీరు అన్తరహిత, వికార రహిత స్వరూపములలో వ్యక్తమగు అద్వితీయ కరుణామయులు. మీరు జ్ఞానభండారులు, మానరహితులు. మీరు సర్వరూపులు, సర్వవ్యాప్తులు. అందరి హృదయ రూపగృహమందు సదా నివసించువారు. అందువలన మీరు మిమ్ము పరిపాలించుడు. రాగద్వేషములను, అనుకూల ప్రతికూలములను, జన్మ మృత్యు విపత్యాదులను హతమార్చుడు. శ్రీరామా! మీరు మా హృదయ మందేయుండి కామ, క్రోధ, మదముల నసింపజేయుడు. మీరు పరమానంద స్వరూప కృపాధాములు. కామనలను పూరించువారు. మాకు మీపై అవిచల ప్రేమభక్తి నొసగుడు. హే రఘునాథా! మీరు మమ్ములను పవిత్రులనుజేసి, త్రితాపములను, జన్మ మరణములను నశింపజేయు భక్తిని ప్రసాదించుడు. శరణాగత కామధేనూ! కల్పవృక్ష రూపప్రభూ! ప్రసన్నులై మాకు ఈ వరమిండు".

భగవానుని వరము పొంది భగవానుని గుణములను గానము చేయుచు సనకాదులు బ్రహ్మలోకమునకు వెళ్ళిరి. ☐

# వివిధ వ్యాధులు - ఆయుర్వేద చికిత్సలు

డా॥ టి. చంద్రశేఖరం, తిరుపతి. 9701181966

**33. రసాయన దధి అమృతము :** పుల్లటి పెరుగు 2 సేర్లు, నారింజ పండ్ల రసం పావుసేరు, దానిమ్మపండ్ల రసం పావుసేరు, మాదీఫలరసము పావుసేరు, ద్రాక్షరసం పావుసేరు, బెల్లం 24 తులాలు, యష్టిమధుకం చూర్ణం 3 తులాలు, జీలకర్రచూర్ణం 1 1/2 తులం, మిరియాల చూర్ణం 1 1/2 తులం, ఈ వస్తువులన్నీ కలిపి బాగా పిసికి గుడ్డలో వేసి వడకట్టిన రసంలో సైంధవ లవణం 1 తులం కలిపి సీసాలో భద్రపరచుకొని ప్రతి నిత్యం 1 గ్లాసు త్రాగుచుండిన ఎడల అజీర్ణము హరించును. ఆకలి పెరుగును. మగతనం ఎక్కువగును. సర్వవ్యాధులు హరించును.

**- అమృతం:** పుల్లటి పెరుగు 2 సేర్లు, బెల్లం 24 తులాలు, జీలకర్ర చూర్ణం 1 1/2 తులం, శొంఠి చూర్ణం 1 1/2 తులం, అల్లం రసం 3 తులాలు, దాసిచెక్క, ఏలకులు, ఆకుపత్రి, నాగకేశరాలు సమభాగాలుగా కలిపి చేసిన చూర్ణం 1 1/2 తులం. ఈ వస్తువులన్నీ కలిపి చేతితో బాగా పిసికి గుడ్డలో వేసి వడకట్టుకొని కొద్దిగా పచ్చకర్పూరం కలిపి ప్రతినిత్యము 1/2 కప్పు సేవించిన ఎడల మూత్రకృఛము (మూత్రం బిగించుట), జిగట, రక్త విరేచనాలు, పైత్య వ్యాధులు హరించును. రక్తపుష్టి చేకూరును.

**34. అమిత బలమునకు :** అశ్వనీ నక్షత్రమునాడు మర్రి ఊడలను తీసుకొని భద్రపరచి ప్రతిరోజూ 3 తులాలు ఎత్తు ఊడలను 10 తులాల ఆవు పాలతో నూరుకొని త్రాగుచుండిన ఎడల అమితమైన బలము కలుగును.

- పుష్యమీ నక్షత్రమునాడు తెల్లజిల్లేడు వేర్లను తీసుకొని వచ్చి భద్రపరచి ఒక తులం ఎత్తు వేర్లను ఐదు తులాల ఆవుపాలతో నూరుకొని ప్రతి నిత్యము త్రాగుచుండిన ఎడల 40 దినములలో వృద్ధుడు కూడ నవ యవ్వనము పొందును.

**35. ఉసిరిక చిట్కాలు :** ఉసిరిక పెచ్చులు చూర్ణమును ఆవనూనెతో మర్దించి ఒంటికి పట్టించుచుండిన ఒంటి దురదలు మూడు రోజులలో హరించును.

36. ఉసిరిక పెచ్చులు 1/2 తులము, ఆవుపాలు 5 తులాలు, పటిక బెల్లం పొడి 1 1/2 తులము కలుపుకొని ప్రతి దినము ఉదయం, సాయంత్రం సేవించుచుండిన ఎడల, వారం రోజులలో గొంతు బొంగురు పోవుట హరించి శ్రావ్యముగా పాడగల్గుదురు.

37. ఉసిరిక వలుపు చూర్ణంలో నెయ్యి, పంచదార కలిపి సేవించిన పైత్యము తగ్గును. ముఖము కాంతివంతముగా ప్రకాశించుచుండును.

38. ఉసిరిక రసం, చెరకు రసం రెండు సమభాగాలుగా కలిపి త్రాగుచుండిన యెడల ఉడుకు వ్యాదులు, వేసవికాలం నందు కలిగే ఎండతాపము హరించును.

39. ఉసిరి కాయలను నీళ్ళతో మర్దించి ప్రతి నిత్యము తలకు పట్టించి అరగంట తరువాత స్నానము చేయుచుండిన యెడల తెల్లవెంట్రుకలు నల్లబడును. కండ్లకు చలువ చేయును.

40. ఉసిరికాయల పెచ్చులను నేతితో మర్దించి మాడుపై పట్టువేసిన ఎడల ముక్కు నుండి రక్తం కారుట అరికట్టును.

41. ఉసిరికాయల రసం పావుసేరు, మజ్జిగ పావుసేరు, ప్రతి నిత్యము ప్రాతఃకాలముమందు త్రాగుచుండిన ఎడల ప్రమేహవ్యాధులు అనగా శుక్రనష్టము, తెల్లబట్ట, ఎర్రబట్ట మొ॥వి 3 వారములలో నశించును.

42. ఉసిరికాయల రసంతో నెయ్యి కలుపుకుని ప్రతినిత్యము సేవించిన ఎడల మూర్ఛవ్యాధి హరించును.

43. నరాల బలహీనత : కసివింద రసంలో వెన్న కలిపి శరీరమునకు మర్దన చేసిన యెడల నరాలకు బలము కల్గును.